FOR ADS.......
CONTACT :
8333818121

# తొలి ఆకాంక్ష

తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964

## విలేకరులు కావలెను

ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..

సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
ఆకాంక్ష akankshanews.com

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :214 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజిలు : 08, వెల. 5రూ/ శనివారం- 28 - మార్చి - 2026

## త్వరలోనే విజయవాడ, అనంతపురంలో తలసేమియా సెంటర్లు



కుప్పంలో పర్యటిస్తున్న నారా భువనేశ్వరి స్వయం ఉపాధికి చేయూత కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పలువురికి కట్టుమిషన్లు, తోపుడు బండ్లు, వినికిడి మిషన్లను అందజేశారు.

చిత్తూరు, మార్చి 27: కుప్పం నియోజకవర్గంలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి(ఛీఫ్‌తీు పర్యటన కొనసాగుతోంది. (శుక్రవారం) కుప్పం టీటీడీ కల్యాణ మండపంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వయం ఉపాధికి చేయూత' కార్యక్రమంలో భువనేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 40 మంది మహిళలకు కుట్టు మిషన్లు, 30 మందికి తోపుడు బండ్లు, పలువురికి వినికిడి మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలను మిగతా..2లో

## ఏపీలో భగ్గుమంటున్న ఎండలు.. 41 మండలాలకు వడగాలుల హెచ్చరిక



రాష్ట్రంలోని 9 మండలాల్లో తీవ్ర వడగాలులు, మరో 32 మండలాల్లో సాధారణ వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

కొన్ని జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 నుంచి 42 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది.

ఆంధ్రప్రదేశ్‌లో ఎండల తీవ్రత ఒక్కసారిగా పెరుగుతోంది. మార్చి నెల ముగియకముందే భానుడు భగభగమంటున్నాడు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) శుక్రవారం (మార్చి 27) పలు ప్రాంతాలకు వడగాలుల హెచ్చరిక జారీ చేసింది. రాష్ట్రంలోని 9 మండలాల్లో తీవ్ర వడగాలులు, మరో 32 మండలాల్లో సాధారణ వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. కొన్ని జిల్లాల్లో ఉష్ణోగ్రతలు మిగతా..2లో

## రాష్ట్రంలో ముదురుతున్న ఎండలు పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ




- ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో పెరుగుతున్న ఎండల తీవ్రత
- 40 నుంచి 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం
- పలు జిల్లాల్లో జల్లులు కూడా కురవొచ్చన్న వాతావరణ శాఖ
- తెలంగాణలో ఉష్ణోగ్రత వివరాలు

ఢిల్లి : ఉపరితల ద్రోణి ప్రభావం కారణంగా గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో వర్షాలు కురవడంలో గరిష్ఠ ఉష్ణోగ్రతల నుంచి కాస్త ఉపశమనం లభించినా, మళ్లీ రెండు రోజుల నుంచి భానుడు భగభగమంటున్నాడు. పలు ప్రాంతాల్లో ఎండతో పాటు ఉక్కపోత కూడా పోస్తోంది. ఎండల తీవ్రతపై హైదరాబాద్ లోని

## భద్రాద్రి రాముల వారి కల్యాణ మహోత్సవానికి

# హాజరైన సీఎం రేవంత్ రెడ్డి..

- భద్రాద్రి రాములవారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.
- లక్షల మంది భక్తులు ఆలయానికి చేరుకుని పెళ్లి వేడుకను కనులవిందుగా తిలకించారు.
- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగలేటి సహా పలువురు ప్రముఖులు వేడుకలో పాల్గొన్నారు.



భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి రాములవారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. లక్షల మంది భక్తులు ఆలయానికి చేరుకుని పెళ్లి వేడుకను కనులవిందుగా తిలకించారు.



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగలేటి సహా పలువురు ప్రముఖులు వేడుకలో పాల్గొన్నారు. ఇవాళ(శుక్రవారం) ఉదయం బేగంపేట మిగతా..2లో

## ఏప్రిల్ 25న కొత్త పార్టీ పేరు

# ప్రకటించనున్న కవిత

- ★ ఏప్రిల్ 25వ తేదీన తన పార్టీని అధికారికంగా ప్రకటించనున్నట్టు తెలిపారు.
- ★ "ఇప్పటివరకు మగవాళ్లు పెట్టిన పార్టీలనే చూశారు. ఇప్పుడు ఓ తెలంగాణ ఆడబిడ్డగా నేను పార్టీ పెడితే ఎలా ఉంటుందో మీరే చూస్తారు"
- ★ నేడు శ్రీరామనవమి పర్వదినం కావడంతో, పార్టీకి సంబంధించిన కీలక అప్ డేట్ ఇస్తున్నామని తెలిపారు.



తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన రాజకీయ పార్టీ ఏర్పాటుపై కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25వ తేదీన తన పార్టీని అధికారికంగా ప్రకటించనున్నట్టు తెలిపారు. తాను సొంతంగా ఒక కొత్త రాజకీయ పార్టీని స్థాపించబోతున్నట్లు ఇప్పటికే ఆమె పలు సందర్భాల్లో వెల్లడించడం తెలిసిందే. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అధ్వయ కన్వెన్షన్‌లో ఏప్రిల్ 25న ఉదయం 8 గంటలకు పార్టీ ఆవిర్భావ సభను నిర్వహించ నున్నట్లు కవిత పేర్కొన్నారు. ఈ వేదికపై పార్టీ పేరు, జెండాను ఆవిష్కరిం చనున్నట్లు ఆమె వివరించారు. నేడు శ్రీరామనవమి పర్వదినం కావడంతో, పార్టీకి సంబంధించిన మిగతా..2లో

## ఇరాన్‌పై యూఎస్ రహస్య ఆయుధం- డ్రోన్ స్పీడ్‌బోట్లు ఎంతటి విధ్వంసం సృష్టిస్తాయంటే?




- పైకి డ్రోన్స్ స్పీడ్ బోట్స్ ప్రయోగానికి అమెరికా సన్నాహాలు
- మరింత తీవ్రమవుతున్న ఉద్రిక్తతలు

ఢిల్లి : పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రరూపం దాల్చడంతో ఇరాన్‌ను నిలువరించేందుకు అమెరికా సరికొత్త అస్త్రాన్ని రంగంలోకి దించింది. గల్ఫ్ సముద్ర మార్గాల్లో పహారా కోసం తొలిసారిగా మానవరహిత డ్రోన్ స్పీడ్‌బోట్లను మోహరించినట్లు పెంటగాన్ అధికారికంగా ధృవీకరించింది. ఇప్పటి వరకు ఈ విషయాన్ని రహస్యంగా ఉంచిన అగ్రరాజ్యం, ఇప్పుడు బహిర్గతం చేయడంతో యుద్ధ సమీకరణలు మారిపోతాయని నిపుణులు

## దేశంలో మళ్లీ లాక్‌డౌన్

# క్లారిటీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం

- ❖ కొవిడ్ తరహా లాక్‌డౌన్ విధించే ప్రసక్తే లేదు
- ❖ ఆ అంశమే ప్రభుత్వం పరిశీలనలో లేదు
- ❖ అవన్నీ నిరాధారణ ఆరోపణలు
- ❖ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్



ఢిల్లి : పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో భారత్‌లో లాక్‌డౌన్ విధించబోతున్నారనే వదంతులను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి కొట్టిపారేశారు. దేశంలో మళ్లీ లాక్‌డౌన్‌ను విధించే ప్రసక్తే లేదని వారు స్పష్టం చేశారు. ప్రజల్లో భయాందోళనలు పెంచేందుకు కొంతమంది బాధ్యతారాహిత్యంతో, ప్రమాదకర రీతిలో ఇలాంటి వదంతులను వ్యాప్తి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ వదంతుల్లో అస్సలు వాస్తవికత లేదన్నారు. లాక్‌డౌన్ అనే ప్రతిపాదనే భారత ప్రభుత్వం పరిశీలనలో లేదని నిర్మల, హర్దీప్ సింగ్ తేల్చి చెప్పారు. ప్రస్తుత పరిస్థితులను యావత్ దేశం బాధ్యతాయుతంగా, ఐక్యంగా, క్రమశిక్షణతో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

**పెట్రోలు, డీజిల్‌లపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాం!**

"మనదేశంలో ఇంధన కొరత ఏర్పడిందని, లాక్‌డౌన్‌ను విధిస్తారని కొందరు నేతలు చెబుతుండగా విని నేను ఆశ్చర్యపోయాను. ఇవన్నీ నిరాధారమైన ఆరోపణలే. ఇలాంటి వ్యాఖ్యలను మిగతా..2లో

## పెట్రోల్, డీజిల్ పై ఎక్సైజ్

# సుంకం తగ్గించిన కేంద్రం

- ❖ పెట్రోల్ పై రూ.13గా ఉన్న ఛార్జీలను రూ.3గా
- ❖ డీజిల్ పై రూ.10 ఉంటే ప్రస్తుతం సున్నాకు తగ్గించినట్లు కేంద్ర వెల్లడి



ఢిల్లి : పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా పెరుగుతున్న ఇంధన ధరల పట్ల ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. లీటరు పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని 13 రూపాయల నుంచి 3 రూపాయలకి తగ్గించింది. లీటరు డీజిల్‌పై 10 రూపాయలుగా ఉన్న సుంకాన్ని సున్నాకు తగ్గించింది. ఈ తగ్గింపు తక్షణమే అమలులోకి వస్తుందని కేంద్రం తెలిపింది. ఫిబ్రవరి 28న ఇరాన్ పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు ప్రారంభమైనప్పటి నుంచి అంతర్జాతీయ చమురు ధరలు దాదాపు 50 శాతం పెరిగాయి. ప్రపంచ ముడిచమురు సరఫరాలో దాదాపు 20 నుంచి 25 శాతం వాటా కలిగిన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధించడంతో ముడిచమురు మిగతా..2లో

## కఠిన సమయాల్లోనే నాయకత్వ పటిమ తెలుస్తుంది




- ఇది ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న బలమైన నిర్ణయమని ఆయన అభివర్ణించారు.
- "కఠినమైన, సవాలుతో కూడిన సమయాల్లోనే నిజమైన నాయకత్వ పటిమ బయటపడుతుంది.

అమరావతి :పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాగతించారు. ఇది ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న బలమైన నిర్ణయమని ఆయన అభివర్ణించారు. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ట్వీట్‌ను చంద్రబాబు తన సోషల్ మీడియా ఖాతాలో రీపోస్ట్ చేస్తూ

## పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలు తగ్గింపు..

# ప్రధానికి ధన్యవాదాలు తెలిపిన లోకేశ్..

- ▸▸ భారత దేశంలో పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను కేంద్ర ప్రభుత్వం భారీగా తగ్గించడంపై ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పందించారు.
- ▸▸ ప్రధాని మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సామాన్యులపై భారం పడకుండా ఎన్డీయే సర్కార్ నిర్ణయం తీసుకుందని ప్రశంసలు కురిపించారు.



అమరావతి: భారత దేశంలో పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను కేంద్ర ప్రభుత్వం భారీగా తగ్గించడంపై ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ప్రధాని మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సామాన్యులపై భారం పడకుండా ఎన్డీయే సర్కార్ నిర్ణయం తీసుకుందని ప్రశంసలు కురిపించారు. 'పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను భారీగా తగ్గించిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు. సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం పడకుండా ప్రధాని మోదీ తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయం. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను లీటర్‌కు రూ. 10 తగ్గించారు. మిగతా..2లో

## బుల్లెట్‌పై ఆరోగ్య యాత్ర,

# 50 వేల కిలోమీటర్ల లక్ష్యం

## బైకర్ తాప్సీకి పవన్ కల్యాణ్ అభినందనలు

మంగళగిరి పార్టీ కార్యాలయంలో పవన్‌ను కలిసిన బైకర్ తాప్సీ ఉపాధ్యాయ

ఊబకాయం నివారణపై అవగాహన కల్పిస్తూ యాత్ర

మిషన్ హెల్తీ లక్ష్యంతో చేపట్టిన యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించిన పవన్



అమరావతి : ప్రజల ఆరోగ్యం కాంక్షిస్తూ, ఊబకాయం సమస్య తగ్గించే లక్ష్యంతో దేశవ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు 'ఒబేసిటీ ముక్త్ భారత్ - మిషన్ హెల్తీ భారత్ పేరిట' బైక్ యాత్ర చేస్తున్న ఉత్తరప్రదేశ్‌లోని మేరఠ్‌కు చెందిన తాప్సీ ఉపాధ్యాయను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభినందించారు. బైకర్ తాప్సీ మంగళగిరి క్యాంపు కార్యాలయంలో పవన్ కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తాను ఈ బైక్ యాత్ర గతేడాది మార్చి 9న మేరఠ్ నుంచి ప్రారంభించానని ఇప్పటి వరకు 16 రాష్ట్రాల్లో 17,400 కిలోమీటర్లు ప్రయాణం చేసినట్లు తెలిపారు. మిగతా..2లో

# సంపాదకీయం

## ఆధునిక రాజ్యం, అనాది నాగరికతల యుద్ధం

2026, ఫిబ్రవరి 28 ఉదయం.. అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై భారీ వైమానిక దాడులు చేశాయి. 12 గంటల్లో ఇరాన్‌లోని క్షిపణి కేంద్రాలు, అణుకేంద్రాలు, సైనిక స్థావరాలపై 900 సార్లు బాంబుల వర్షం కురిసింది. ఇరాన్ అత్యున్నత నాయకుడు అలీ ఖమేనీ కుటుంబంతో సహా ప్రాణాలు కోల్పోయారు. ఈ యుద్ధం రెండుమూడు రోజుల్లో ముగిసిపోతుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. పాతిక రోజుల తర్వాత.. హోర్ముజ్ జలసంధి ఇంకా తెరుచుకోలేదు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రమాదం అంచున నిలబడింది. 1970లలో వచ్చిన రెండు చమురు సంక్షోభాల కంటే ప్రస్తుత పరిస్థితి దారుణంగా ఉందని అంతర్జాతీయ ఇంధన సంస్థ ప్రకటించింది. ఇరాన్ నౌకాదళం నాశనమైనా, నాయకులు హతమైనా, అణుకేంద్రాలపై మూడుసార్లు దాడులు జరిగినా.. ఆ దేశం ఇంకా పాలన సాగిస్తోంది, పోరాడుతోంది. ఇప్పటికీ అంతర్జాతీయ చర్చల్లో తన నిబంధనలనే విధిస్తోంది. మార్చి 22న ట్రంప్ '48 గంటల్లోగా హోర్ముజ్ జలసంధిని తెరవకపోతే, ఇరాన్‌లోని పవర్ ప్లాంట్లను నాశనం చేస్తాం' అని తన 'ట్రూత్ సోషల్' వేదికగా ఒక వార్నింగ్ ఇచ్చారు. దీనికి ఇరాన్ 'పర్షియన్ గల్ఫ్ మొత్తం మందుపాతరలతో నింపేస్తామని, చమురు కేంద్రాలన్నింటినీ ధ్వంసం చేస్తామ'ని గట్టిగా బదులిచ్చింది. తను ఇచ్చిన గడువు ముగియడానికి మరో 12 గంటలు ఉందనగా.. అమెరికా, ఇరాన్ మధ్య 'చాలా మంచి, ఉపయోగకరమైన చర్చలు జరిగాయని', అందుకే దాడులను ఐదురోజులు వాయిదా వేస్తున్నానని ట్రంప్ ప్రకటించారు. ఒక మహాసామ్రాజ్యం క్షిపణులను ప్రయోగించింది. ఒక పురాతన నాగరికత ఆ దాష్టీకాన్ని తట్టుకొని నిలబడింది. ఇది ఏడువేల ఏళ్ల చరిత్ర వర్సెస్ రెండువందల ఏళ్ల అధికారం! ఇరాన్ పీఠభూమిలో 7,000 ఏళ్ల నుంచే మానవ ఆవాసం ఉంది. క్రీస్తుపూర్వం 3200 నాటికే అక్కడ ఒక గొప్ప నాగరికత విలసిల్లింది. క్రీస్తుపూర్వం 6వ శతాబ్దంలో 'సైరస్ ది గ్రేట్' పాలనలో పర్షియన్ సామ్రాజ్యం ప్రపంచంలోనే అతిపెద్ద శక్తిగా ఎదిగింది. గ్రీస్, ఈజిప్ట్, టర్కీ, ఇరాక్ నుంచి మన పక్కనే ఉన్న పాకిస్థాన్ వరకు అది విస్తరించింది. క్రీస్తుపూర్వం 539లో, యుద్ధం లేకుండానే బాబిలోన్‌ను సైరస్ జయించారు. అక్కడి ప్రజలే కోట తలుపులు తెరిచి ఆయనకు స్వాగతం పలికారు. ఆ సమయంలో సైరస్ తన ఆజ్ఞను ఒక స్తూపంపై రాయించారు. ప్రస్తుతం బ్రిటిష్ మ్యూజియంలో ఉన్న ఆ స్తూపాన్ని, 1971లో ఐక్యరాజ్యసమితి ప్రపంచంలోనే మొదటి మానవ హక్కుల ప్రకటనగా గుర్తించింది. ఆ సైరస్ స్తూపం ప్రకారం.. ఆయన బానిసలందరికీ విముక్తిని, మతస్వేచ్ఛను, సమానత్వాన్ని ప్రసాదించారు. హీబ్రూ బైబిల్‌లో యూదుడు కాని వ్యక్తిని 'మెస్సయ్య' (దేవునిచే ఎన్నుకోబడినవాడు) అని పిలిచారంటే అది కేవలం సైరస్‌ను మాత్రమే. సైరస్ చక్రవర్తి మానవ హక్కుల పత్రాన్ని ప్రకటించిన 2,315 ఏళ్ల తర్వాత (1776లో) పుట్టిన అమెరికా.. ఇప్పుడు అదే నాగరికతను గగనతలం నుంచి నామరూపాలు లేకుండా చేయాలని చూస్తోంది. సైరస్ పత్రం వెలువడిన 2,487 ఏళ్ల తర్వాత (1948లో) ఏర్పడిన ఇజ్రాయెల్.. తన భద్రత పేరుతో ఆ నాగరికతను లొంగ దీసుకోవాలని ప్రయత్నిస్తోంది. పాతికరోజుల పాటు సాగిన ఈ వైమానిక దాడులు ఇరాన్ సుదీర్ఘచరిత్రలో ఒక చేదు అధ్యాయం మాత్రమే. కానీ, అమెరికాకు మాత్రం ఇలాంటి యుద్ధం ఊహకందని విషయం. క్రీస్తుపూర్వం 330లో అలెగ్జాండర్ 'పెర్సెపోలిస్' నగరాన్ని తగులబెట్టాడు. 13వ శతాబ్దంలో మంగోలులు ఇరాన్ నగరాలపై విరుచుకుపడి, కొన్ని ప్రాంతాల్లో ముప్పావు వంతు జనాభాను ఊచకోత కోశారు. ఇక 1953లో బ్రిటన్ కుట్ర పన్ని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధాని మొహమ్మద్ మొసాద్దెగ్‌ను గద్దె దించింది. 1980లో అమెరికా అందించిన ఆయుధాలతో ఇరాక్.. ఇరాన్‌పై ఎనిమిదేళ్ల పాటు సాగించిన యుద్ధంలో లక్షలాది మంది ఇరానీయులు బలయ్యారు. అయినా సరే, ఇరాన్ ఇంకా ఉంది. పర్షియా ఎప్పుడూ ఇక్కడే ఉంది. ఇప్పుడు బాంబుల దాడికి గురవుతున్నది అవిసెన్నా (ఇబ్న్ సీనా) వంటి మహనీయుల నాగరికత. ఆయన రాసిన 'కానన్ ఆఫ్ మెడిసిన్' గ్రంథం ఆరు శతాబ్దాల పాటు యూరప్ విశ్వవిద్యాలయాల్లో ప్రధాన వైద్య పాఠ్యపుస్తకంగా ఉండేది. ఇది అల్‌బిరూని నాగరికత. ఆయన వెయ్యేళ్ల క్రితమే భూమి చుట్టుకొలతను కేవలం ఒక శాతం తేడాతో కచ్చితంగా లెక్కించారు. యూరప్‌లో పుస్తకాలు తగులబెడుతున్న కాలంలోనే, బీజగణితంలో క్యూబిక్ ఈక్వేషన్స్‌కు పరిష్కారాలు చూపిన ఖయ్యామ్ నాగరికత ఇది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఇష్టపడే హాఫీజ్, రూమీల కవిత్వం పుట్టిన గడ్డ ఇది. టెహ్రాన్‌పై బాంబులు పడుతున్నాయంటే, ఆ గొప్ప వారసత్వాన్ని మోస్తున్న నగరంపై పడుతున్నాయని అర్థం. అటువంటి లోతైన వారసత్వం వైమానిక దాడులతో అంతమైపోదు. ఇలాంటి దాడులు ఆ పాత పౌరుషాన్ని మరింతగా తట్టి లేపుతాయి. ఫిబ్రవరి 28, 2026న మొదటి 'టోమాహాక్' క్షిపణి ప్రయోగించడానికి ముందే, ఇరాన్ దాదాపు అర్ధ శతాబ్దకాలంగా మనుగడకోసం పోరాడుతూనే ఉంది. అమెరికా మొదటిసారిగా 1979 నవంబర్‌లో ఇరాన్‌పై ఆంక్షలు విధించింది. అమెరికా అధ్యక్షులు మారారు తప్ప ఇరాన్‌పై ఆంక్షలు ఎప్పుడూ తొలగలేదు, పైగా పెరుగుతూనే వచ్చాయి. అవి ఇరాన్‌ను మరింతగా రాటుదేల్చాయి. ఇరాన్ విడిభాగాలను దిగుమతి చేసుకోలేకపోయింది కాబట్టి, వాటిని సొంతంగా తయారు చేయడం నేర్చుకుంది. పాశ్చాత్య సాంకేతికత దొరకలేదు కాబట్టి, దాన్ని 'రివర్స్ఇంజనీరింగ్' చేసింది. అత్యాధునిక ఆయుధాలను కొనలేకపోయింది కాబట్టి, తక్కువ ఖర్చుతో, భారీ స్థాయిలో వినూత్న ఆయుధాలను అభివృద్ధి చేసింది. అమెరికా విధించిన కఠినమైన ఆంక్షల నుంచే 'షాహెద్136' సూసైడ్ డ్రోన్ పుట్టింది.

# కిరాయి సైనికులతో కొత్త ముప్పు




భారత జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) ఇటీవల కోల్‌కతాలో మాథ్యూ వాన్‌డైక్ అనే అమెరికన్‌ను అరెస్టు చేసింది. అతడితోపాటు ఆరుగురు ఉక్రెయిన్ జాతీయులనూ వివిధ చోట్ల అదుపులోకి తీసుకుంది. రష్యా గూఢచర్య సంస్థల నుంచి ఎన్ఐఏకి ఉప్పందడంతో ఈ అరెస్టులు జరిగాయి. పాశ్చాత్య దేశాలకు చెందిన కిరాయి సైనికులు భారత్ గడ్డపై సంచరిస్తున్నారని బయటపడటం అనూహ్య పరిణామం. దేశ భద్రతకు ఇదొక కొత్త ముప్పుగా పరిణమిస్తుందా? వాన్‌డైక్ బృందం ఐరోపా నుంచి తెచ్చిన డ్రోన్లను ఈశాన్య భారతం గుండా మయన్మార్‌లోని తిరుగుబాటుదారుల గ్రూపులకు అందించినట్లు సమాచారం. ఇలా డ్రోన్లను దొంగ రవాణా చేయడం, వాటి కూర్పు, మరమ్మతులు, ఎలక్ట్రానిక్ యుద్ధరీతులలో మయన్మార్ తిరుగుబాటుదారులకు శిక్షణ ఇవ్వడం వాన్‌డైక్ బృందం పని అని రష్యా వెల్లడించింది. ఉక్రెయినియన్ల అరెస్టుపై భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందిస్తూ- కేసు దర్యాప్తులో ఉందనీ, చట్టపరమైన విధివిధానాలకు అనుగుణంగా ముందుకెళ్తామని వెల్లడించారు. ఈ వ్యవహారం గురించి తమకు తెలిసినా, గోప్యతా కారణాల దృష్ట్యా అమెరికా పౌరులకు సంబంధించిన కేసులపై వ్యాఖ్యానించలేమని ఆ దేశ రాయబార కార్యాలయం పేర్కొంది. ఉక్రెయిన్ ప్రపంచ వ్యాప్తంగా అస్థిరతను వ్యాపింపజేస్తోందనీ, సాయుధ సంఘర్షణను తన సరిహద్దుల వెలుపలికి ఎగుమతి చేస్తోందని రష్యా విదేశాంగ శాఖ విమర్శించింది.

### అనుమతులు లేకుండానే..

ఎన్ఐఏ దాఖలు చేసిన ప్రాథమిక సమాచార నివేదిక ప్రకారం, నిందితులలో కొందరు పర్యాటక వీసాలపై భారత్‌కు వచ్చి, అస్సాం, మిజోరం వంటి రాష్ట్రాల్లో ప్రయాణించారు. విదేశీయులు మిజోరంలో ప్రయాణించాలంటే రక్షిత ప్రాంత పర్మిట్ (పీఏపీ) తప్పనిసరి. కానీ, నిందితులు అలాంటి అధికార అనుమతులు లేకుండానే ఈశాన్య భారతం నుంచి మయన్మార్‌లోకి ప్రవేశించారనేది ఆరోపణ. మయన్మార్ ప్రభుత్వంపై పోరాడుతున్న సాయుధ గ్రూపులకు ఉక్రెయినియన్లు డ్రోన్ శిక్షణ ఇచ్చారని, ఈ గ్రూపులకు ఈశాన్య భారత తిరుగుబాటు సంస్థలతో కూడా సంబంధాలు ఉన్నాయని ఎన్ఐఏ పేర్కొంది. విదేశీ పౌరులు అంతర్జాతీయ సరిహద్దులకు సమీపంలోని భారత ప్రాంతాలను సందర్శించాలంటే పీఏపీ అనే ప్రత్యేక అనుమతి అవసరం. అరుణాచల్ ప్రదేశ్, మణిపుర్, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, రాజస్థాన్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలకు లేదా మొత్తంగా కొన్ని రాష్ట్రాలకు ఈ నిబంధన వర్తిస్తుంది. పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి 2011లో మణిపుర్, మిజోరం, నాగాలాండ్‌లను ఈ నిబంధన పరిధి నుంచి మినహాయించారు. అయితే, పొరుగు దేశాల నుంచి చొరబాట్ల వల్ల భద్రతాపరంగా ఆందోళన పెరిగిన దృష్ట్యా రెండేళ్ల క్రితం కేంద్ర హోంశాఖ ఈ రాష్ట్రాల్లోనూ పీఏపీ నిబంధనను పునరుద్ధరించింది. దాన్ని ఉల్లంఘించిన వాన్‌డైక్, ఉక్రెయిన్ జాతీయులపై ఉగ్రవాద వ్యతిరేక చట్టం (యూఏపీఏ) కింద కేసులు నమోదు చేశారు. అరెస్టుకు ముందు దాదాపు మూడు నెలల పాటు ఈశాన్య ప్రాంతంలో వీరి కదలికలను గమనించారు. 2024 నుంచి వీరు మయన్మార్‌కు పలుమార్లు ప్రయాణించి డ్రోన్లు, సిగ్నల్ జామింగ్ పరికరాలు సరఫరా చేస్తూ ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తూ వచ్చారని ఎన్ఐఏ అధికారులు ఆరోపిస్తున్నారు. పశ్చిమాసియా, ఆఫ్రికా దేశాలతో పోలిస్తే భారతదేశంలో విదేశీ లేదా పాశ్చాత్య కిరాయి సైనికుల ప్రమేయం మొదటి నుంచీ చాలా తక్కువ. అయితే, మారుతున్న అంతర్జాతీయ భద్రతా పరిస్థితులు, సరిహద్దుల్లో అనిశ్చితి వంటివి విదేశీ కిరాయి సైనికుల రాకకు వీలు కల్పిస్తున్నాయి. 1947 తరవాత నుంచి భారత్ ఎదుర్కొన్న భద్రతా సవాళ్లు ప్రధానంగా అంతర్గతమైనవి లేదా పొరుగు దేశాలతో ప్రేరేపితమైనవి. జమ్మూకశ్మీర్‌లో 1980ల నుంచి విదేశీ ఉగ్రవాదుల ఉనికి కనిపిస్తున్నా, వారు పాశ్చాత్య దేశాల నుంచి కాకుండా పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, పశ్చిమాసియాల నుంచి వచ్చినవారు. సిద్ధాంతపరమైన లేదా మతపరమైన ప్రేరణతో వారు ఇక్కడ ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. తాజాగా వాన్‌డైక్ అరెస్టు ఒక కొత్త ధోరణిని సూచిస్తోంది. విదేశీ కిరాయి సైనికులు భారత భూభాగం గుండా ఇతరులకు ఆయుధాలు, డ్రోన్ల బట్వాడాకు నడుంకట్టారు. వారు భారత్‌ను కీలకమైన రవాణా మార్గంగా వాడుకోవాలని చూస్తున్నారు. వాన్‌డైక్ 'సన్స్ ఆఫ్ లిబర్టీ ఇంటర్నేషనల్' అనే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు. లిబియా అంతర్యుద్ధ సమయంలో గడాఫీకి వ్యతిరేకంగా పోరాడటం ద్వారా వార్తల్లోకి వచ్చాడు. మోటార్ సైకిల్‌పై ఉత్తర ఆఫ్రికా, పశ్చిమాసియా దేశాల్లో పర్యటించాడు. సిరియా అంతర్యుద్ధంలోనూ పాల్గొన్నాడు. 2022 మార్చి నుంచి అతని సంస్థ ఉక్రెయిన్‌లో రష్యాకు వ్యతిరేకంగా పనిచేస్తోంది.

### భారత్‌కు ఎందుకు ఆందోళనకరం?

మయన్మార్‌లో అస్థిరత పెరగడం వల్ల ఇలాంటి కిరాయి సైనికులకు గిరాకీ అధికమైంది. నిరుడు మార్చిలో మిజోరం ముఖ్యమంత్రి లాల్‌దుహోమా మాట్లాడుతూ-2024లో వేల సంఖ్యలో విదేశీ కిరాయి సైనికులు తమ రాష్ట్రంలోకి ప్రవేశించి, మయన్మార్ తిరుగుబాటుదారులకు శిక్షణ ఇవ్వడానికి సరిహద్దు దాటి వెళ్లినట్లు చెప్పారు. అమెరికా, బ్రిటన్ దేశాలు మయన్మార్ సైనిక పాలనను అస్థిరపరచడానికి చేస్తున్న రహస్య కార్యకలాపాలలో ఇదో భాగమని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. మిజోరం, మణిపుర్‌లలోని భారత్-మయన్మార్ సరిహద్దులో విదేశీయుల సంచారం ఎక్కువవుతోంది. మయన్మార్ తిరుగుబాటుదారు గ్రూపులకు పాశ్చాత్య కిరాయి సైనికులు శిక్షణ ఇస్తే, ఆ నైపుణ్యాలు ఈశాన్య భారత ముష్కర మూకలకు కూడా చేరే ప్రమాదం ఉంది. విదేశీ కిరాయి సైనికులు ఇప్పటికైతే భారత అంతర్గత భద్రతకు ముప్పుగా మారలేదు కానీ, భవిష్యత్తులో పరిస్థితి మారి కొత్త ముప్పుగా పరిణమించే ప్రమాదం లేకపోలేదు. యుద్ధాలు ప్రపంచీకరణ చెందుతున్న తరుణంలో, భారత భూభాగం లేదా పొరుగు ప్రాంతాలు విదేశీ కిరాయి సైనికుల నెట్‌వర్క్‌లలో చిక్కుకోకుండా చూడటం ప్రస్తుతం మన ముందున్న సవాలు.

# సమరమా.. సామరస్యమా?

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ, ప్రపంచమంతా ఒక్కటే ప్రశ్న.. శాంతి నెలకొంటుందా లేక మహా సంగ్రామం మొదలవుతుందా. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ఐదు రోజుల గడువు శుక్రవారంతో (మార్చి 26) ముగుస్తుండటంతో.. ఒమన్ వేదికగా జరిగిన రహస్య చర్చలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అసలు ఒమన్ లో ఏం జరిగింది కొందరు అలాంటి సమావేశమే జరగలేదని చెప్తున్నా.. జరుగుతున్న ఒక్కో పరిణామం, ఆధారాలు చూస్తే సమావేశం జరిగినట్టు స్పష్టంగా తెలుస్తున్నది. మరి ఆ సమావేశంలో ఏ విషయాలు చర్చకు వచ్చాయి అసలు ఆ సమావేశంలో పాల్గొన్న నేతలు ఎవరు ఒకవేళ యుద్ధ విరామం సానుకూల ఫలితాలు ఇస్తే సరేసరి.. లేదంటే ప్రపంచం మొత్తం తల్లకిందులు అయ్యే ప్రమాదంఉన్నది. ముందుగా ఆ సమావేశంలో ఏం జరిగిందో చూద్దాం..

### మస్కట్‌లో రహస్య భేటీ

ఒమన్ రాజధాని మస్కట్ అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్‌కి అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్, అధ్యక్షుడు ట్రంప్ సలహాదారు జారెడ్ కుష్నర్ 20వ తేదీన చేరుకున్నారు. విట్కాఫ్ సాధారణంగా ఏ విదేశీ ప్రయాణం చేసినా తన సొంత విమానాన్నే వాడుతుంటారు. ఒమన్‌కి కూడా ఆయన ఆ విమానాన్నే వాడారు. ఈ వివరాలను అంతర్జాతీయ విమానాలను ట్రాకింగ్ చేసే ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్ అనే సంస్థ ఫ్లైట్ నంబర్‌తో సహా వెల్లడించింది. వీళ్లిద్దరూ అదేరోజు సాయంత్రం ఒమన్ విదేశాంగ మంత్రి బదర్ అల్బుసైదీతో భేటీ అయ్యారు. ఇరాన్ ప్రతిపాదిస్తున్న ప్రతిపాదనలపై ప్రాథమిక చర్చలు జరిపారు. ఆ మరునాడే అంటే 21వ తేదీన ఒమన్‌కు చెందిన అధికారిక గల్ఫ్ స్ట్రీమ్ అనే విమానంలో ఇరాన్ ప్రతినిధులు మస్కట్ చేరుకున్నారు. ఆ రోజు 10 గంటలనుంచి 22వ తేదీ రాత్రి 7గంటల వరకు ఇరాన్ ప్రతినిధులతో పరోక్ష చర్చలు జరిగాయి. అయితే ఇరాన్, అమెరికా ప్రతినిధులు ఒకే గదిలో కూర్చుని సమావేశం కాకుండా.. వేర్వేరు గదుల్లో కూర్చుని ఉండగా.. ఒమన్ ప్రతినిధులు ఇరు దేశాల నేతలకు మధ్య షటిల్ రాయబారం నడిపారు. ఈ చర్చల్లో ఇరాన్ మజ్లిస్ (పార్లమెంట్) స్పీకర్ గాలిబాఫ్ సన్నిహితుడు ఇరాన్ అణు చర్చల ప్రతినిధి అలీ బఘేరి కని సహా ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ చర్చలపై రాయిటర్స్, అల్ జజీరా, ఏపీ వంటి అంతర్జాతీయ మీడియా సంస్థలు కథనాలు కూడా ఇచ్చాయి. ఇజ్రాయెల్ మీడియా కూడా స్పీకర్ గాలిబాఫ్, విదేశాంగ మంత్రి అరాగ్చీని దాడుల నుంచి తాత్కాలిక రక్షణ కల్పించినట్లు వెల్లడించింది.

### డిమాండ్లు ఇవే..

ఈ చర్చల్లో అమెరికా పదిహేను డిమాండ్లు ప్రతిపాదించగా.. అందులో ప్రధానమైనవి ఇలా ఉన్నాయి.. 1. ఇరాన్ తన సైనిక, అణు సామర్థ్యాన్ని తగ్గించుకోవాలి. 2. 60% శుద్ధి చేసిన యురేనియం నిల్వలను అప్పగించాలి. 3. హోర్ముజ్ జలసంధిని మూసివేయబోమని హామీ ఇవ్వాలి. 4. సుదూర శ్రేణి క్షిపణి పరీక్షలను తక్షణమే నిలిపివేయాలి. 5. లెబనాన్ (హిజ్బుల్లా), యెమెన్ (హౌతీలు) వంటి గ్రూపులకు సైనిక సాయాన్ని ఆపాలి. ఇరాన్ ఈ చర్చల్లో నాలుగు కీలక



షరతులు ముందుకు తెచ్చింది. 1. తమ దేశ చమురును ప్రపంచ మార్కెట్లో స్వేచ్ఛగా అమ్ముకోవడానికి అనుమతించాలి, అమెరికా ఆంక్షలను ఎత్తివేయాలి. 2. పవర్ ప్లాంట్లు, అణు కేంద్రాలతోపాటు సైనిక స్థావరాలపై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేయబోమని గ్యారెంటీ ఇవ్వాలి. 3. అగ్రనేతలను (సుప్రీం లీడర్ ముజ్తబా ఖమేనీ వంటి వారిని) టార్గెట్ చేసే 'రెజీమ్ చేంజ్' కుట్రలను ఆపాలి. 4. విదేశీ బ్యాంకుల్లో నిలిచిపోయిన నిధులను వెంటనే విడుదల చేయాలి. ఇలా ఎవరి డిమాండ్లు వారు ప్రతిపాదించినా.. 'ఎవరు ముందు తగ్గాలి' అన్న పాయింట్ వద్ద చర్చలు ప్రస్తుతానికి ముగిశాయి. విట్కాఫ్, కుష్నర్ మధ్యవర్తిత్వానికి ఇరాన్ నేతలు సుముఖంగా లేరు.. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తో చర్చలను మాత్రమే అంగీకరిస్తామని చెప్పినట్లు తెలుస్తున్నది. 26 తర్వాత ఎప్పుడైనా పాకిస్తాన్‌లోని ఇస్లామాబాద్‌లో వాన్స్, ఇరాన్ నేతలకు మధ్య చర్చలు జరుగనున్నాయి. ఇప్పటికే అధ్యక్షుడు ట్రంప్ సైతం వాన్స్, రూబియోలను మధ్యవర్తులుగా ప్రకటించిన సంగతి తెలిసిందే.

### చర్చలు విఫలమైతే.. టార్గెట్లు ఇవే!

ఒకవేళ శుక్రవారం (26వ తేదీ) నాటికి చర్చలు కొలిక్కి రాకపోతే, యుద్ధం మరింత ముదిరే అవకాశాలు లేకపోలేదు. ఈ క్రమంలో రెండు దేశాలు ఇప్పటికే తమ టార్గెట్లను సిద్ధం చేసుకున్నాయి. చర్చలు విఫలమైతే అమెరికా ఇరాన్ లోని ప్రధాన చమురు ఎగుమతి కేంద్రం ఖార్గ్ ఐల్యాండ్ ను టార్గెట్ చేసే అవకాశం ఉన్నది. ఇరాన్ సైతం ప్లాన్ బీలో ఉన్నది. చర్చలు విఫలమైన మరుక్షణం అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు భీకరమైన ప్రతిదాడులు చేసేందుకు రెడీ అవుతున్నది. అమెరికా సన్నిహిత దేశమైన యూఏఈని ప్రధానంగా టార్గెట్ చేసే అవకాశం ఉన్నది. దీంతోపాటు గల్ఫ్ దేశాలకు అత్యంత ముఖ్యమైన డీశాలినేషన్ (సముద్రనీటిని తాగునీరుగా మార్చేవి) ప్లాంట్లను దెబ్బతీసేందుకు అవకాశం ఉన్నది.

### అంతర్జాతీయ సంక్షోభం

చర్చలు విఫలమైతే ఇరాన్ నష్టపోయేదానికంటే వందరెట్లు ప్రపంచదేశాలు నష్టపోనున్నాయి. ఇప్పటికే 100డాలర్లకుపైన ఉన్న చమురు ధరలు హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టు బిగిస్తే 150డాలర్లు దాటే ప్రమాదం ఉన్నది. అదే జరిగితే భారత్ లో లీటర్ పెట్రోల్ రూ.150నుంచి రూ.200వరకు వెళ్లవచ్చు. ఇది భారత్ ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చే ప్రమాదం ఉన్నది. ఇప్పటికీ మన దేశం ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగంలో అతి తక్కువ స్థాయిలో ఉండటం కూడా దీనికి ఒక కారణం. మొత్తానికి ఒక యుద్ధం మొత్తం ప్రపంచాన్ని తలకిందులు చేయబోతున్నది. అంతర్జాతీయ సంక్షోభానికి అమెరికా, ఇజ్రాయెల్ బాధ్యులుగా మిగలనున్నాయి.

# ఐదు రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలదే హవా!

దక్షిణాదిలోని కీలకమైన రెండు రాష్ట్రాలు తమిళనాడు, కేరళం, ఒక కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి, తూర్పు రాష్ట్రాలైన అస్సాం, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలకు ఏప్రిల్ నెలాఖరులోగా జరిగే ఎన్నికలు దేశ రాజకీయ పరిస్థితులకు అద్దం పట్టనున్నాయి. మే 4న ఫలితాలు వెలువడే ఈ ఐదు ప్రాంతాల శాసనసభ ఎన్నికల ఫలితాలు మరోసారి కొన్ని ప్రాంతీయ పార్టీల బలాన్ని నిరూపించబోతున్నాయి. ఒక్క అస్సాం మినహా ఈ రాష్ట్రాల్లో ప్రధాన జాతీయపక్షాలైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల బలం నామమాత్రమే. మిగిలినచోట్ల సొంతంగా అధికారంలోకి వచ్చే పరిస్థితి ఈ రెండు పార్టీలకు లేదు. ఐదింటిలో కాస్త పెద్ద రాష్ట్రమైన పశ్చిమ బెంగాల్‌లో ప్రాంతీయపక్షమైన ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) వరుసగా నాలుగోసారి అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడానికి సిద్ధమవుతున్నది. బెంగాల్ సరిహద్దు రాష్ట్రమైన అస్సాంలో గత పదేండ్లుగా పాలకపక్షమైన బీజేపీ మూడోసారి మళ్లీ గెలిచే అవకాశాలున్నాయని కొన్ని సర్వేలు చెప్తున్నాయి. రాజకీయంగా కీలకమైన దక్షిణాది పెద్ద రాష్ట్రం తమిళనాడులో ప్రధాన ప్రాంతీయ పార్టీ, డీఎంకే అధ్యక్షుడు, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని పార్టీ రెండోసారి విజయం సాధించగలననే ధీమాతో ముందుకు సాగుతున్నది. ప్రధాన ప్రతిపక్షమైన ఏఐఏడీఎంకేలో చీలికలు, ఆ పార్టీ పొత్తుపై ఆధారపడిన బీజేపీకి సొంతంగా బలం పెరుగపోవడం స్టాలిన్ రెండోసారి విజయం సాధించే అవకాశాలను పెంచుతున్నాయి. కేరళంలో కమ్యూనిస్టుల (సీపీఎం) నాయకత్వంలోని ఎల్డీఎఫ్ వరుసగా మూడోసారి (2016, 2021 తర్వాత) 2026 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తుందనే అంచనాతో పరిశీలకులు ఉన్నారు. సీపీఎం నేత పినరయి విజయన్ పదేండ్ల సుపరిపాలన, బీజేపీతో రహస్య ఒప్పందాలతో కాంగ్రెస్ అనుసరిస్తున్న దిగజారుడు రాజకీయాలు ఎల్డీఎఫ్ విజయానికి దారితీయవచ్చని అంచనా. ఎన్నికలు జరిగే నాలుగు రాష్ట్రాల్లో అతి




చిన్నదైన అస్సాంలో బీజేపీ తొలిసారి 2016లో అధికారం కైవసం చేసుకున్నది. ప్రస్తుత ముఖ్యమంత్రి, కాంగ్రెస్ మాజీ నేత హిమంతా బిశ్వ శర్మ తొలిసారి సీఎం పీఠమెక్కారు. మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడే ఆయన వివాదాస్పదమైన నాయకుడు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య ప్రధానంగా పోటీ జరుగుతున్న ఏకైక రాష్ట్రం ఇప్పుడు అస్సాం ఒక్కటే. బంగ్లాదేశ్ సరిహద్దు రాష్ట్రమైన అస్సాంలో ముస్లింల జనాభా దాదాపు 34 శాతానికి పైగా ఉండడం, ముస్లింలు క్రమేపీ కాంగ్రెస్‌కు దూరమై ఆలిండియా యునైటెడ్ డెమోక్రాటిక్ ఫ్రంట్ (ఏఐయూడీఎఫ్)కు దగ్గరవడం బీజేపీకి మేలు జరిగే ఉన్నాయి. విదేశీ పౌరులకు వ్యతిరేకంగా వచ్చిన ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించిన 'ఆసు' నేతల ప్రాబల్యంలోని అస్సాం గణ పరిషత్ (ఏజీపీ) గతంలో అధికారంలోకి వచ్చింది. అయితే, ఇప్పుడు ఈ పార్టీ బలహీనపడి బీజేపీకి భాగస్వామిగా మారడం కాషాయ పార్టీని పాలకపక్షంగా మార్చింది. పశ్చిమ బెంగాల్‌లో పోటీ ప్రధానంగా కిందటిసారిలా టీఎంసీ, బీజేపీ మధ్యనే ఉంటుందని తెలుస్తున్నది. 1977 నుంచి 2011 వరకూ 34 ఏండ్లు సీపీఎం నాయకత్వంలోని వామపక్షాలు అధికారంలో ఉండగా, 2011, 2016 అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్, వామపక్ష ఫ్రంట్ మధ్య ప్రధాన పోటీ జరిగింది. 2016 నుంచి కాషాయ పార్టీ 2021 అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్‌కు ప్రత్యామ్నాయం లేదా ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. ఈ తూర్పు రాష్ట్రంలో చారిత్రకంగా ముస్లింల జనాభా ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చితే చాలా ఎక్కువ. దాదాపు 27 శాతానికి పైగా ముస్లింలు నివసిస్తున్న కారణంగా బీజేపీ మైనారిటీలపై వ్యతిరేకతను జనంలో రెచ్చగొట్టే పద్ధతి అనుసరించింది. ఫలితంగా 2016 ఎన్నికల్లో కేవలం మూడు స్థానాలు గెలుచుకున్నది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ బలం 77కు పెరిగింది. 2017లో జరిగిన కాంథీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో టీఎంసీకి ప్రధాన ప్రత్యర్థిగా బీజేపీ అవతరించింది. కేవలం ఉనికి కోసమే, లెఫ్ట్‌ఫ్రంట్, కాంగ్రెస్ కూటమి ప్రస్తుత ఎన్నికల్లో పోటీచేస్తున్నాయి. 2021 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో, ఆ తర్వాత 2024 లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేసిన ఏఐడీఎంకే, బీజేపీ కూటమికి 2026 అసెంబ్లీ ఎన్నికల్లో అసలు విజయావకాశాలు కనిపించడం లేదు. 2019 పార్లమెంటు, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీచేసిన ఏఐడీఎంకే, బీజేపీ కూటమికి ఓటమి తప్పలేదు. 2023లో రెండు పార్టీలూ కూటమి నుంచి వైదొలిగాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో విడివిడిగా పోటీచేసి రెండు పార్టీలూ దెబ్బతిన్నాయి. ఫలితంగా ప్రస్తుత తమిళ శాసనసభ ఎన్నికల సందర్భంగా మరోసారి ఈ రెండు పార్టీలు చేతులు కలిపాయి. సీఎం స్టాలిన్ దాదాపు 60 ఏండ్లుగా రాష్ట్రంలో అమలవుతున్న ద్రావిడ

### ఆర్సీబీకి కోలుకోలేని దెబ్బ..

# తొలి మ్యాచ్‌కే స్టార్ బౌలర్ దూరం

**ఐపీఎల్లో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో రాత్రి 7:30 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. అయితే, కింగ్ కోహ్లీ సేన గెలుపుతో బోణీ కొట్టాలని చూస్తుంటే, మ్యాచ్‌కు ముందే ఆర్సీబీకి ఒక గట్టి షాక్ తగిలింది.**



ఐపీఎల్ 2026 అసలైన మజా రేపటి నుంచే (మార్చి 28) మొదలవ్వనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగుతున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు , తమ మొదటి పోరులో సన్‌రైజర్స్ హైదరాబాద్ తో తలపడనుంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో రాత్రి 7:30 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. అయితే, కింగ్ కోహ్లీ సేన గెలుపుతో బోణీ కొట్టాలని చూస్తుంటే, మ్యాచ్‌కు ముందే ఆర్సీబీకి ఒక గట్టి షాక్ తగిలింది. ఆ జట్టు ప్రధాన బౌలర్ ఈ కీలకమైన ఓపెనింగ్ మ్యాచ్‌కు దూరం కావడం అభిమానులను కలవరపెడుతోంది. ఐపీఎల్ 2026 ప్రారంభానికి కొన్ని గంటల ముందే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు చేదు వార్త అందింది. ఆ జట్టు ప్రధాన పేసర్ జోష్ హేజిల్‌వుడ్ ఫిట్‌నెస్ కారణాలతో తొలి మ్యాచ్‌కు అందుబాటులో ఉండటం లేదు. నిజానికి హేజిల్‌వుడ్ గురువారమే బెంగళూరు చేరుకున్నప్పటికీ, అతను ఇంకా పూర్తిగా కోలుకోలేదని సమాచారం. ఆర్సీబీ హెడ్ కోచ్ ఆండీ ఫ్లవర్ ఈ విషయాన్ని ధృవీకరిస్తూ.. "జోష్ ప్రస్తుతం బరిలోకి దిగడానికి సిద్ధంగా లేదు, మేము అతని ఫిట్‌నెస్‌ను నిశితంగా గమనిస్తున్నాము" అని పేర్కొన్నారు.

గత కొంతకాలంగా హేజిల్‌వుడ్ అకిలెస్ హీల్ (మడమ గాయం), హామ్‌స్ట్రింగ్ సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ గాయాల కారణంగానే అతను ప్రసిద్ధ యాషెస్ సిరీస్‌తో పాటు టీ20 వరల్డ్ కప్ 2026లో కూడా ఆస్ట్రేలియా జట్టులో చోటు కోల్పోయాడు. నవంబర్ 2025 నుంచి అతను మైదానానికి దూరంగానే ఉన్నాడు. చాలా కాలం తర్వాత ఐపీఎల్‌తో రీఎంట్రీ చేస్తాడని ఆశించిన అభిమానులకు, అతని గైర్హాజరీ తీవ్ర నిరాశను మిగిల్చింది. హేజిల్‌వుడ్ స్థానంలో జట్టులో ఎవరిని తీసుకుంటారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఆర్సీబీ గతేడాది ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడటంలో జోష్ హేజిల్‌వుడ్ పాత్ర మరువలేనిది. గత సీజన్‌లో అతను 12 మ్యాచ్‌లు ఆడి ఏకంగా 22 వికెట్లు పడగొట్టాడు. ముఖ్యంగా 8.77 ఎకానమీతో అత్యంత పొదుపుగా బౌలింగ్ చేస్తూ ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేశాడు. ఇప్పుడు అతను లేకపోవడంతో ఆర్సీబీ బౌలింగ్ విభాగం కాస్త బలహీనంగా కనిపిస్తోంది. మహమ్మద్ సిరాజ్, యశ్ దయాల్ వంటి ఇతర పేసర్లు ఇప్పుడు అదనపు బాధ్యతను మోయాల్సి ఉంటుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో ఈసారి ట్రావిస్ హెడ్, హెన్రిక్ క్లాసెన్ వంటి భారీ హిట్టర్లు ఉన్నారు. చిన్నస్వామి వంటి చిన్న స్టేడియంలో వారిని అడ్డుకోవాలంటే హేజిల్‌వుడ్ వంటి అనుభవం ఉన్న బౌలర్ అవసరం చాలా ఉంది. అయినప్పటికీ, విరాట్ కోహ్లీ, రజత్ పాటిదార్ వంటి స్టార్ బ్యాటర్లతో ఆర్సీబీ పటిష్టంగానే ఉంది. రేపు రాత్రి 7:30 గంటలకు ప్రారంభం కానున్న ఈ పోరులో గెలిచి, టైటిల్ డిఫెన్స్‌ను ఘనంగా ప్రారంభించాలని బెంగళూరు పట్టుదలతో ఉంది.

### ఐపీఎల్ 19వ సీజన్ స్పెషల్ అట్రాక్షన్..

# కామెంటరీ బాక్స్‌లోకి తమిళ్ తంబీ ఎంట్రీ

**ఐపీఎల్ 2026 కామెంటరీ ప్యానెల్ ప్రకటన వచ్చేసింది. హిందీలో అశ్విన్, ఇంగ్లీష్ లో డారెన్ గంగా వంటి దిగ్గజాలు తమ మాటలతో అలరించనున్నారు. డారెన్ గంగా ఆటగాడిగా కంటే కామెంటరేటర్‌గా ఆయనకు ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు లభించింది.**



ఐపీఎల్ 19వ సీజన్ రేపటి నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో క్రికెట్ అభిమానులకు డబుల్ ధమాకా ఇచ్చేలా కామెంటరీ ప్యానెల్ ప్రకటన వచ్చేసింది. ఈసారి మైదానంలో ఆటగాళ్లు సిక్సర్లు కొడుతుంటే, కామెంటరీ బాక్స్‌లో దిగ్గజాలు తమ మాటలతో మ్యాజిక్ చేయనున్నారు. అయితే ఈ జాబితాలో ఒక ఆసక్తికరమైన పేరు అందరినీ ఆకర్షిస్తోంది. వెస్టిండీస్ మాజీ కెప్టెన్, ప్రస్తుతం ప్రముఖ కామెంటరేటర్ అయిన డారెన్ గంగా గురించి ఇప్పుడు నెట్టింట చర్చ జరుగుతోంది. ఆయన క్రికెట్ కెరీర్ కంటే, ఆయన వ్యక్తిగత జీవితం వెనుక ఉన్న ఒక చిన్నపాటి సెంటిమెంట్ కథ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.

డారెన్ గంగా

వెస్టిండీస్ మాజీ కెప్టెన్ డారెన్ గంగా తన కెరీర్‌లో 48 టెస్టులు, 35 వన్డేలు ఆడారు. అయితే ఆటగాడిగా కంటే కామెంటరేటర్‌గా ఆయనకు ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు లభించింది. కానీ ఆయన వ్యక్తిగత జీవితం చాలా సింపుల్ గా ఉంటుంది. ట్రినిడాడ్‌లో ఆయనకు ఒక జ్యూస్ సెంటర్ ఉంది, దాని పేరు గంగా జ్యూస్ బార్. దీనిని ఆయన భార్య పరిణీత విజయవంతంగా నడుపుతున్నారు. ఆస్ట్రేలియాలో పుట్టి న్యూయార్క్‌లో పెరిగిన పరిణీతకు భారతీయ సంస్కృతి అంటే చాలా ఇష్టం. 2020 లాక్ డౌన్ సమయంలో తన భార్య సూచన మేరకే గంగా ఈ వ్యాపారం ప్రారంభించారు. ఇప్పుడు ఆయన ఐపీఎల్ ఇంగ్లీష్ కామెంటరీ ప్యానెల్ లో కీలక సభ్యుడిగా ఉన్నారు.

కామెంటరీ బాక్స్‌లోకి అశ్విన్ ఎంట్రీ

ఈ సీజన్‌లో మరో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. భారత దిగ్గజ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కామెంటరేటర్‌గా అవతారమెత్తడం. సాధారణంగా అశ్విన్ మాతృభాష తమిళం, ఆయన ఇంగ్లీష్ లో అనర్గళంగా మాట్లాడగలరు. కానీ ఈసారి ఆయన హిందీ ప్యానెల్‌లో కామెంటరీ చేయనుండటం విశేషం. తన యూట్యూబ్ ఛానెల్ ద్వారా ఇప్పటికే హిందీలో విశ్లేషణలు చేస్తూ అభిమానులను అలరిస్తున్న అశ్విన్, ఇప్పుడు ప్రత్యక్షంగా ఐపీఎల్ మైదానంలో తన విశ్లేషణలతో ఆకట్టుకోనున్నారు.

ఐపీఎల్ 2026 కామెంటరీ ప్యానెల్స్ వివరాలు ఇంగ్లీష్ కామెంటరీ టీమ్: డారెన్ గంగాతో పాటు ఏబీ డివిలియర్స్, డేల్ స్టెయిన్, ఫాఫ్ డుప్లెసిస్, కెవిన్ పీటర్సన్, ఆరోన్ ఫించ్, ఇయాన్ మోర్గాన్, మైఖేల్ క్లార్క్, మిచెల్ మెక్లెనాగన్, దీప్ దాస్‌గుప్తా, సునీల్ గవాస్కర్, రవిశాస్త్రి, హర్షా భోగ్లే, ఇయాన్ బిషప్, సైమన్ డౌల్, డానియల్ మోరిసన్, నిక్ నైట్, గ్రేమ్ స్మిత్ వంటి దిగ్గజాలు ఉన్నారు.

హిందీ కామెంటరీ టీమ్: రవిచంద్రన్ అశ్విన్ తో పాటు సురేష్ రైనా, హర్భజన్ సింగ్, ఇర్ఫాన్ పఠాన్, వీరేంద్ర సెహ్వాగ్, అనిల్ కుంబ్లే, పీయూష్ చావ్లా, ఉమేష్ యాదవ్, ఆకాష్ చోప్రా, ఛతేశ్వర్ పుజారా, ఆదిత్య తారే, నవజ్యోత్ సింగ్ సిద్ధూ, సునీల్ గవాస్కర్, సంజయ్ బంగర్, అజయ్ జడేజా, మహమ్మద్ కైఫ్, సబా కరీమ్, దీప్ దాస్‌గుప్తా, పదంజీత్ సెహ్రావత్, అనంత్ త్యాగి, సునీల్ తనేజా ఉండనున్నారు.

## హార్దిక్ మంచి మనసు- ఆ 11మందికి క్యాష్ రివార్డ్- ఎందుకంటే

**హార్దిక్ పాండ్య మంచి మనసు- ఐపీఎల్ ప్రారంభానికి ముందు గ్రౌండ్ స్టాఫ్‌కు భారీ నజరానా!**

టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ హార్దిక్ పాండ్య తన మంచి మనసు చాటుకున్నాడు. ముంబయి వాంఖడే స్టేడియంలోని గ్రౌండ్ద స్టాఫ్ కు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాడు. 11 మంది స్టాఫ్ కు నగదు బహుమతి ఇచ్చాడు. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. దీంతో నెటిజన్లు హార్దిక్ గొప్ప మనసును ప్రశంసిస్తున్నారు. ఇంతకీ గ్రౌండ్ స్టాఫ్ కు హార్దిక్ ఎందుకు చెక్ ఇచ్చాడు? వాళ్లకు ఇచ్చిన మాటేంటంటే హార్దిక్ స్టాఫ్ సహాయం!

హార్దిక్ కొంతకాలం విశ్రాంతి తర్వాత ఇటీవల టీ20 వరల్డ్ కప్ లో బరిలో దిగాడు. అయితే ఇందులో పాల్గొనేందుకు టోర్నీకి ముందు అతడు బాగా కష్టపడ్డాడు. వాంఖడే స్టేడియంలో ఫిట్ నెస్ కోసం నెట్స్ లో తీవ్రంగా చెమటోడ్చాడు. బ్యాటింగ్, బౌలింగ్ రెండు విభాగాల్లో మెరుగుపర్చుకునేందుకు నెట్స్‌లో అర్ధరాత్రి దాకా బాగా కష్టపడ్డాడు. అయితే ఆ సమయంలో గ్రౌండ్ స్టాఫ్ తమ విధులు ముగినప్పటికీ హార్దిక్ కోసం అక్కడే ఉన్నారు. తనకు అదనపు సౌకర్యాలు చేశారట. ప్రాక్టీస్ కోసం హార్దిక్ కు నెట్స్ రెడీ చేయడం, పిచ్ ను చూసుకోవడంలాంటి అనేక సౌకర్యాలు చేశారు. అయితే తమ విధులు ముగిసినా తన కోసం అదనపు గంటలు అక్కడే సమయం కేటాయిస్తున్న గ్రౌండ్ స్టాఫ్ కు హార్దిక్ అప్పుడే ఓ మాట ఇచ్చాడట. వాళ్లందరికీ మంచి గిఫ్ట్ ఇస్తానని చెప్పాడట. ఆ తర్వాత అతడు టీ20 వరల్డ్ కప్ లో ఆడాడు. ఈ టోర్నీలో హార్దిక్ వ్యక్తిగత ప్రదర్శన కూడా ఆశించిన స్థాయిలోనే ఉంది. దీంతో స్టాఫ్ కు ఇచ్చిన మాట ఇలా క్యాష్ రివార్డ్ ఇచ్చి నిలబెట్టుకున్నాడు. గురువారం ముంబయి ఇండియన్స్ టీమ్ ప్రాక్టీస్ ముగిసిన తర్వాత హార్దిక్ గ్రౌండ్ స్టాఫ్ తో కలిశాడు. ఈ చెక్కులను వాళ్లకు స్వయంగా అందించాడు. కాగా,

# IPL నుంచి బ్యాన్ అయిన 8మంది క్రికెటర్లు- లిస్ట్‌లో ఇండియన్ ప్లేయర్లు కూడా!



### భారత క్రికెటర్లతో సహా 8 మంది ఆటగాళ్లను ఐపీఎల్ నుంచి బ్యాన్ చేసిన మరి వాళ్లు ఎవరంటే

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ శనివారం (మార్చి 28న) ప్రారంభమవుతుంది. ఈ నేపథ్యంలో అందరూ రికార్డులు, థ్రిల్లింగ్ మ్యాచ్ ల గురించే చర్చించుకుంటారు. కానీ, ఐపీఎల్ లో రికార్డులే కాదు, కాంట్రవర్సీలు కూడా అనేకం ఉన్నాయి. అంపైర్ల తప్పిదాలు, ఆటగాళ్ల మధ్య వివాదాలూ ఉన్నాయి. అయితే వీటన్నింటిని అంటుంచితే పలువురు క్రికెటర్లు ఆయా కారణాల వల్ల ఐపీఎల్ నుంచి నిషేధం కూడా ఎదుర్కొన్నారు. రీసెంట్ గా 2026 లీజన్ టోర్నమెంట్ ప్రారంభానికి ముందే, ఇంగ్లాండ్ ఓపెనర్ బెన్ డకెట్ ఈ లీగ్ నుంచి తన పేరును ఉపసంహరించుకున్నాడు. దీంతో అతడిని బీసీసీఐ ఐపీఎల్ నుంచి నిషేధించే అవకాశం ఉంది. గతేడాది డకెట్ సహచర ఆటగాడు హ్యారీ బ్రూక్ కూడా ఇదే విధంగా ప్రవర్తించడంతో అతనిపై బీసీసీఐ వేటు వేసింది. రెండేళ్లు ఐపీఎల్ లో ఆడనుండా నిషేధం విధించింది. ఈ క్రమంలో ఇప్పటివరకు ఐపీఎల్ నుంచి దీజజ× బ్యాన్ చేసిన ఆటగాళ్లెవరో చూద్దాం!

ప్రవీణ్ తాంబే

"వయస్సు అనేది ఒక సంఖ్య మాత్రమే" అనే నానుడిని నిజం చేసిన ఆటగాడు ప్రవీణ్ తాంబే. 41ఏళ్ల వయసులో రాజస్థాన్ రాయల్స్ తరపున 2013లో ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. 2016 వరకు ఐపీఎల్ ఆడిన అతడు మొత్తం 33 మ్యాచ్‌ల్లో బరిలో దిగాడు. ఇందులో 7.75 ఎకానమీతో 28 వికెట్లు పడగొట్టాడు. అయితే ముందస్తు అనుమతి లేకుండా ఇతర దేశాలలో ఫ్రాంచైజీ క్రికెట్‌లో పాల్గొన్నందుకు బీసీసీఐ అతనిని ఐపీఎల్ లో ఆడకుండా నిషేధించింది.

స్టీవ్ స్మిత్

ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ 2018 మార్చిలో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్ట్ మ్యాచ్ సందర్భంగా 'బాల్ ట్యాంపరింగ్' వివాదంలో చిక్కుకున్నాడు. ఈ సంఘటన తర్వాత క్రికెట్ ఆస్ట్రేలియా స్మిత్‌పై ఏడాది పాటు నిషేధం విధించింది. దీంతో ఆ ప్రభావం ఐపీఎల్ పైనా పడింది. ఆడకుండా బ్యాన్ చేసింది.

ల్యూక్ పోమర్స్‌బాక్

మాజీ ఆస్ట్రేలియా క్రికెటర్ ల్యూక్ పోమర్స్‌బాక్ ఐపీఎల్ తొలి సీజన్ లోనే అరంగేట్రం చేశాడు. అయితే 2012లో ఢిల్లీ డేర్ డెవిల్స్ తో మ్యాచ్ తర్వాత హోటల్ లో అతడు ఒక అమెరికన్ మహిళపై దాడి చేశాడనే ఆరోపణలు వచ్చాయి. ఐపీఎల్ సమయంలో ఇది తీవ్ర దుమారం రేపింది. ఆ సమయంలో ల్యూక్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున ఆడుతున్నాడు. ఈ సంఘటన కారణంగా ఫ్రాంచైజీ మిగిలిన టోర్నమెంట్ నుంచి సస్పెండ్ చేసింది.

రవీంద్ర జడేజా

టీమ్ఇండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా కూడా నిషేధం ఎదుర్కొన్నాడు. అతడిని 2010 ఐపీఎల్ నుంచి బ్యాన్ చేశారు. ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించినందుకు జడేజాపై ఆ సీజన్ నుంచి నిషేధం పడింది. ఆ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ, అతను ముంబయి ఇండియన్స్‌తో కాంట్రాక్ట్ కుదుర్చుకోవడానికి ప్రయత్నించాడు.

హ్యారీ బ్రూక్

ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ హ్యారీ బ్రూక్‌పై బీసీసీఐ రెండేళ్ల నిషేధం విధించింది. కొత్త నిబంధనల ప్రకారం, వేలంలో అమ్ముడైన తర్వాత చివరి నిమిషంలో టోర్నీలో ఆడేందుకు నిరాకరిస్తే రెండేళ్లపాటు నిషేధం పడుతుంది. గతేడాది బ్రూక్ విషయంలో ఇదే జరిగింది. 2025 ఐపీఎల్ కోసం రూ.6.25 కోట్లకు ఢిల్లీకి అమ్ముడైన తర్వాత బ్రూక్, చివరి నిమిషంలో ఆడేందుకు నిరాకరించాడు. దీంతో బీసీసీఐ లీగ్ నుంచి రెండేళ్లు (2025, 2026) అతడిని సస్పెండ్ చేసింది.

హర్భజన్ సింగ్

2008లో జరిగిన తొలి ఐపీఎల్ సీజన్‌లో పంజాబ్- ముంబయి మధ్య మ్యాచ్ వివాదానికి కేంద్ర బిందువుగా నిలిచింది. ఈ మ్యాచ్ అనంతరం శ్రీశాంత్‌ను హర్భజన్ సింగ్ చెంపదెబ్బ కొట్టాడు. ఈ ఘటన తర్వాత హర్భజన్‌పై ఆ సీజన్ మొత్తం నిషేధం పడింది.

డేవిడ్ వార్నర్

ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్ కూడా, స్టీవ్ స్మిత్‌తో కలిసి 'బాల్-ట్యాంపరింగ్' వివాదంలో చిక్కుకున్నాడు. దీంతో స్మిత్ తోపాటు వార్నర్ ను కూడా 2018 సీజన్ మొత్తం బ్యాన్ చేసింది. ఆ సీజన్ లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టును కేన్ విలియమ్సన్ నడిపించాడు.

మహ్మద్ ఆసిఫ్

పాకిస్థాన్ మాజీ పేసర్ మహ్మద్ ఆసిఫ్ ఒకప్పుడు ప్రపంచంలో అత్యుత్తమ బౌలర్లలో ఒకడు. 2008 సీజన్‌లో గ్లెన్ మెక్ గ్రాత్‌తో కలిసి ఢిల్లీ తరపున అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. అయితే ఈ పాకిస్థాన్ పేసర్ మాదకద్రవ్యాలను ఉపయోగిస్తున్నట్లు తేలడంతో ఐపీఎల్ నుంచి బ్యాన్ చేశారు.

# లైవ్ స్ట్రీమింగ్ నుంచి పిచ్ రిపోర్ట్ వరకు.. బెంగళూరు వర్సెస్ హైదరాబాద్ మ్యాచ్ పూర్తి వివరాలివే



## మార్చి 28న ఐపీఎల్ 2026 ప్రారంభ పోరులో ఆర్సీబీ వర్సెస్ ఎస్ఆర్‌హెచ్ తలపడనున్నాయి. చిన్నస్వామి స్టేడియంలో జరగనున్న ఈ మ్యాచ్ లైవ్ స్ట్రీమింగ్, పిచ్ రిపోర్ట్, పూర్తి వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

ఐపీఎల్ 2026 హంగామా మొదలైపోయింది. డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ), పవర్‌ఫుల్ సన్‌రైజర్స్ హైదరాబాద్ (ూ=ఎ) జట్ల మధ్య రేపు (శనివారం, మార్చి 28) అంగరంగ వైభవంగా తొలి మ్యాచ్ జరగనుంది. బెంగళూరులోని ఎం.చిన్నస్వామి స్టేడియం ఈ హై వోల్టేజ్ పోరుకు వేదిక కానుంది. గత సీజన్‌లో తొలిసారి ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడి చరిత్ర సృష్టించిన ఆర్సీబీ, అదే జోష్‌ను ఈసారి కూడా కొనసాగించాలని పట్టుదలతో ఉంది. మరోవైపు, టీ20 వరల్డ్ కప్ హీరో ఇషాన్ కిషన్ సారథ్యంలో బరిలోకి దిగుతున్న హైదరాబాద్, తొలి మ్యాచ్‌లోనే బెంగళూరును ఢీకొట్టేందుకు సిద్ధమైంది. రజత్ పాటిదార్ సారథ్యంలో సరికొత్త ఆర్సీబీ! గత సీజన్‌లో అద్భుత ప్రదర్శనతో మొదటి ఐపీఎల్ టైటిల్‌ను గెలుచుకున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఈసారి రజత్ పాటిదార్ నాయకత్వంలో బరిలోకి దిగుతోంది. గత ఏడాది అంతా తానై జట్టును నడిపించిన పాటిదార్, ఈసారి కూడా అదే ఊపును కొనసాగించాలని చూస్తున్నాడు. అయితే, ప్రధాన పేసర్ జోష్ హేజిల్‌వుడ్ గాయం కారణంగా తొలి మ్యాచ్‌కు దూరం కావడం జట్టుకు కొంచెం లోటే. అయినప్పటికీ హోమ్ గ్రౌండ్ చిన్నస్వామిలో ఆర్సీబీ రికార్డు చాలా బాగుంది. ఇక్కడ బ్యాటర్లకు పిచ్ సహకరిస్తుండటంతో విరాట్ కోహ్లీ బ్యాట్ నుంచి పరుగుల వరద పారడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈసారి మరింత పటిష్టంగా కనిపిస్తోంది. టీ20 వరల్డ్ కప్ గెలిచిన భారత జట్టులో కీలక పాత్ర పోషించిన ఇషాన్ కిషన్, ఇప్పుడు స్టాండ్-ఇన్ కెప్టెన్‌గా హైదరాబాద్‌ను నడిపిస్తున్నాడు. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ వంటి విధ్వంసకర ఓపెనర్లు ఫామ్‌లో ఉండటం ఆ జట్టుకు అతిపెద్ద బలం. గత సీజన్‌లో ప్లేఆఫ్స్ చేరలేకపోయిన బాధను ఈసారి విజయంతో తుడిచిపెట్టాలని ఆరెంజ్ ఆర్మీ పట్టుదలతో ఉంది. ముఖ్యంగా గత ఏడాది ఆర్సీబీపై ఇషాన్ కిషన్ చేసిన 94 పరుగుల వీరబాదుడు అభిమానులకు ఇంకా గుర్తే ఉంది.

లైవ్ స్ట్రీమింగ్, మ్యాచ్ సమయం

ఐపీఎల్ 2026 ప్రారంభ మ్యాచ్ మార్చి 28 (శనివారం) రాత్రి 7:30 గంటలకు ప్రారంభమవుతుంది. అంతకుముందు 7:00 గంటలకు టాస్ వేస్తారు. ఈసారి ఐపీఎల్ ప్రసార హక్కుల్లో మార్పులు వచ్చాయి. అభిమానులు ఈ మ్యాచ్‌ను టీవీలో స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ద్వారా చూడవచ్చు. మొబైల్ లేదా వెబ్‌సైట్‌లో చూడాలనుకునే వారు జియో హాట్‌స్టార్ (జీఆశీఎశేర్ఘుతీ) యాప్ ద్వారా లైవ్ స్ట్రీమింగ్‌ను వీక్షించవచ్చు. ఇది గతంలో కంటే మెరుగైన యూజర్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుందని టెక్ వర్గాలు చెబుతున్నాయి.

హెడ్-టు-హెడ్, పిచ్ రిపోర్ట్

గణాంకాల పరంగా చూస్తే ఈ రెండు జట్ల మధ్య పోరు ఎప్పుడూ రసవత్తరంగానే ఉంటుంది. ఇప్పటివరకు జరిగిన 25 మ్యాచ్‌లలో హైదరాబాద్ 13 సార్లు విజయం సాధించగా, బెంగళూరు 11 సార్లు గెలిచింది. ఒక మ్యాచ్ ఫలితం తేలలేదు. ఇక చిన్నస్వామి పిచ్ విషయానికి వస్తే, ఇది బ్యాటర్లకు స్వర్గధామం. బౌండరీలు చిన్నవి కావడంతో భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశం ఉంది. ఫాస్ట్ బౌలర్లకు ప్రారంభంలో కొంచెం స్వింగ్ లభించినా, మ్యాచ్ సాగుతున్న కొద్దీ బ్యాటర్లు ఆధిపత్యం చలాయిస్తారు.

వాతావరణ పరిస్థితి

బెంగళూరు వాతావరణం రేపు క్రికెట్ మ్యాచ్‌కు అనుకూలంగా ఉంది. పగటిపూట ఉష్ణోగ్రత 32 డిగ్రీల సెల్సియస్ వరకు ఉన్నా, మ్యాచ్ సమయానికి (రాత్రి) 24 నుంచి 26 డిగ్రీలకు పడిపోయి చల్లగా మారుతుంది. అక్యూవెదర్ రిపోర్ట్ ప్రకారం మ్యాచ్ జరిగే సమయంలో వర్షం పడే అవకాశాలు అస్సలు లేవు. కాబట్టి ఎటువంటి ఆటంకం లేకుండా 40 ఓవర్ల పూర్తి ఆటను మనం ఎంజాయ్ చేయవచ్చు. మరిన్ని క్రీడా వార్తల కోసం ఇక్కడ క్లిక్ చేయండి..

# రామ్‌చరణ్..
## నీ వ్యక్తిత్వమే శ్రీరామరక్ష



### తనయుడికి చిరంజీవి విషెష్

రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో సందడి నెలకొంది. 'పెద్ది' గ్లింప్స్‌తో అభిమానుల్లో జోష్ పెంచారు. కుమారుడికి శుభాకాంక్షలు చెబుతూ చిరంజీవి అరుదైన ఫొటోలను పంచుకున్నారు. 'చరణ్ బాబు.. చిన్నప్పుడు నా వేలు పట్టుకొని నడిచిన స్థాయి నుంచి.. ఈరోజు ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచే స్థాయికి ఎదగడం చూస్తుంటే నాకు చాలా గర్వంగా ఉంది. సినిమా, వ్యక్తిగత జీవితాన్ని నువ్వు బ్యాలెన్స్ చేసే విధానం, కుటుంబంపై నీకున్న బాధ్యత, దేవుడిపై భక్తి, క్రమశిక్షణ, నీ విలువలు.. వీటిని చూసిన ప్రతిసారీ నీపై నా ప్రేమ, గౌరవం మరింత పెరుగుతూనే ఉన్నాయి. ఆ దేవుడి ఆశీస్సులు, అభిమానుల ప్రేమాభిమానాలు నిన్ను ఉన్నత శిఖరాలకు నడిపించాలని కోరుకుంటున్నాను' అని చిరంజీవి తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. 'పుట్టినరోజు శుభాకాంక్షలు మై స్వీటెస్ట్ కజిన్. ఈ ఇయర్ 'పెద్ది' మూవీ పెద్ద సక్సెస్ ఇవ్వాలని కోరుకుంటున్నా అంటూ అల్లు అర్జున్ తెలిపారు.

'హ్యాపీ బర్త్‌డే అన్నయ్య! నువ్వు చిన్నప్పుడు ఎంత అల్లరి చేసేవాడివో నాకు ఇప్పటికీ గుర్తుంది. కానీ ఇప్పుడు నిన్ను చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. ఇంతటి విజయాన్ని అందుకున్నా కూడా నువ్వు ఎంతో వినయంగా ఉంటావు. నీలో ఆ లక్షణం నాకు ఎంతో ఇష్టం.

# ఇప్పట్లో పెళ్లి ఆలోచన లేదు

నిర్మొహమాటంగా చెప్పి సాయిపల్లవి

దక్షిణాది సినీ పరిశ్రమలో సహజ నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న స్టార్ హీరోయిన్ సాయి పల్లవి మరోసారి వార్తల్లో నిలిచారు. డ్యాన్స్ షోల నుంచి సినీ ప్రపంచంలోకి అడుగుపెట్టి, తన టాలెంట్‌తో టాప్ హీరోయిన్‌గా ఎదిగిన ఆమె ప్రయాణం నిజంగా స్ఫూర్తిదాయకం. చిన్నప్పటి నుంచే నాట్యం, నటనపై ఆసక్తి ఉన్నప్పటికీ చదువును ప్రాధాన్యంగా తీసుకుని మెడికల్ డిగ్రీ పూర్తి చేసిన సాయి పల్లవి, ప్రేమమ్ సినిమాలో 'మలర్ టీచర్' పాత్రతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత ఫిదా సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరై, తన సహజ నటన, తెలంగాణ యాసతో కుర్రకారును మెస్మరైజ్ చేసింది. దీంతో ఆమెకు 'లేడీ పవర్ స్టార్' అనే ట్యాగ్ కూడా వచ్చింది. ప్రస్తుతం ఆమె కెరీర్ పీక్‌లో ఉంది. బాలీవుడ్‌లో జునైద్ ఖాన్ తో కలిసి ఓ సినిమాతో ఎంట్రీ ఇస్తుండగా, ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ రామాయణం లో సీత పాత్ర పోషించడం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. అలాగే తమిళంలో ధనుష్ సరసన



కూడా ఓ భారీ చిత్రంలో నటిస్తూ బిజీగా ఉంది. ఇదిలా ఉంటే, ఇటీవల ఆమె పెళ్లిపై వస్తున్న రూమర్లకు తానే స్వయంగా ఫుల్‌స్టాప్ పెట్టింది. ఒక కార్యక్రమంలో మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ సాయి పల్లవి స్పష్టంగా తన అభిప్రాయం వెల్లడించింది. 'ప్రస్తుతం నా పూర్తి దృష్టి కెరీర్‌పైనే ఉంది. పెళ్లి గురించి ఇప్పట్లో ఎలాంటి ఆలోచన లేదు. నేను ప్రస్తుతం సింగిల్‌గానే ఉన్నాను అని చెప్పి అందరికీ క్లారిటీ ఇచ్చింది. ఆమె పెళ్లి విషయంపై సోషల్ మీడియాలో విభిన్న స్పందనలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఫ్యాన్స్ ఆమె నిర్ణయాన్ని సమర్థిస్తుంటే, మరికొందరు మాత్రం ఆమె పెళ్లి వార్త కోసం ఎదురుచూస్తున్నారు.

# పవన్ తనయుడితో రామ్‌చరణ్



### విషెస్ చెబుతూ అన్నాలెజ్నెవా పోస్ట్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నేడు తన పుట్టినరోజును ఘనంగా జరుపుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా అభిమానులు, సినీ ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తుండగా, సోషల్ మీడియా అంతా చరణ్ బర్త్‌డే పోస్టులతో నిండిపోయింది. ముఖ్యంగా మెగా ఫ్యామిలీ సభ్యులు షేర్ చేసిన ప్రత్యేక ఫోటోలు, సందేశాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం చరణ్ దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న 'పెద్ది' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఇటీవల షూటింగ్ సమయంలో గాయపడినప్పటికీ, త్వరగా కోలుకుని మళ్లీ సెట్స్‌లోకి వచ్చి అభిమానులను కలవడం ఫ్యాన్స్‌కు రిలీఫ్ ఇచ్చింది. ఈ బర్త్‌డే సందర్భంగా ఒక అన్‌సీన్ ఫోటో సోషల్ మీడియాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పవన్ కళ్యాణ్ భార్య అన్నా లెజ్నెవా తన కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్ తో కలిసి చరణ్ ఉన్న ఒక క్యూట్ ఫోటోను షేర్ చేస్తూ బర్త్‌డే విషెస్ తెలిపారు. 'మార్క్ మరియు మా కుటుంబం తరపున చరణ్ అన్నకు హ్యాపీ బర్త్‌డే' అంటూ ఆమె చేసిన పోస్ట్ అభిమానులను ఆకట్టుకుంది. ఆ ఫోటోలో చరణ్ పక్కన కూర్చుని మార్క్ ఫోన్ చూస్తుండగా, చరణ్ ఎంతో ప్రేమగా అతన్ని గమనిస్తున్న తీరు నెటిజన్లను ఫిదా చేసింది. సాధారణంగా పవన్ కళ్యాణ్ కుటుంబానికి సంబంధించిన ఫోటోలు చాలా అరుదుగా బయటకు వస్తుంటాయి. అలాంటిది ఈ సందర్భంలో బయటకు రావడంతో మెగా ఫ్యాన్స్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

# పెద్ది టీజర్ విడుదల చేసిన చిత్రబృందం




రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'పెద్ది'. రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేశారు. 'పెద్ది అంటే బంతితో బ్యాటుకు ఎదురెళ్లే ఆట కాదురా.. పాణంతో సావుకు ఎదురెళ్లే ఆట' అనే డైలాగు.. 'ఆటే నా పొగరు' అని హీరో చెప్పడం ఆకట్టుకుంటోంది . చరణ్‌కు జోడీగా జాన్వీ కపూర్ నటిస్తోన్న ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు 'పెద్ది' టీమ్ స్పెషల్ ట్రీట్ అందించింది. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ భారీ రూరల్ స్పోర్ట్స్ డ్రామా నుంచి మార్చి 27న సరికొత్త టీజర్ విడుదలై సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇప్పటికే విడుదలైన మొదటి టీజర్‌లో చరణ్ క్రికెట్ ప్లేయర్‌గా కనిపించి ఆకట్టుకోగా, తాజా టీజర్‌లో మాత్రం పూర్తిగా భిన్నమైన మాస్ అవతార్‌లో దర్శనమిచ్చాడు. కుస్తీ పోటీలలో పాల్గొనే శక్తివంతమైన యోధుడిగా ఆయన కనిపించిన తీరు అభిమానులను ఉర్రూతలూగిస్తోంది. భారీ దేహదారుఢ్యం, కఠినమైన చూపులు, రఫ్ లుక్ అన్నీ చరణ్ పాత్రను మరింత పవర్‌ఫుల్‌గా చూపిస్తున్నాయి. ఈ టీజర్ ద్వారా సినిమా నేపథ్యం, కథా గురించి కొంత క్లారిటీ వచ్చింది. ఉత్తరాంధ్ర గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో స్థానిక క్రీడలు, ముఖ్యంగా కుస్తీ పోటీలు కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తోంది. చరణ్ ఫిజిక్, బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌లో ఆమె పాత్ర కూడా ఆసక్తికరంగా ఉండబోతుందని సమాచారం. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, 'పెద్ది' సినిమా భారీ స్థాయిలో రూపొందుతోంది. కథ, టేకింగ్, మ్యూజిక్, యాక్షన్ అన్ని విభాగాల్లో ఈ చిత్రం కొత్త ప్రమాణాలు సృష్టించే అవకాశముందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.ఇప్పటికే టీజర్‌తోనే భారీ బజ్ క్రియేట్ చేసిన 'పెద్ది', విడుదల తర్వాత బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాల్సి ఉంది.

# భక్తి, భావోద్వేగాల మేళవింపుగా ఇరుముడి




భక్తి, బంధాలు, భావోద్వేగాలతోపాటు... రవితేజ శైలి మాస్ అంశాల మేళవింపుతోనూ రూపొందుతున్న చిత్రమే 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రియ భవానీ శంకర్ కథానాయిక. బేబి నక్షత్ర, సాయికుమార్ ముఖ్య పాత్రల్ని పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే యాభై శాతం చిత్రీకరణని పూర్తి చేసుకుందీ చిత్రం. ప్రస్తుతం హైదరాబాద్‌లో యాక్షన్ సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. స్టంట్ కొరియోగ్రాఫర్లు అనల్ అరసు, రియల్ సతీశ్ నేతృత్వంలో విభిన్నమైన పోరాట ఘట్టాల్ని తెరకెక్కిస్తున్నారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని చిత్రబృందం ఓ ప్రత్యేకమైన పోస్టర్‌ని విడుదల చేసింది. తండ్రీకూతుళ్లుగా నటిస్తున్న రవితేజ, బేబి నక్షత్ర ఆ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. అద్భుతమైన కథ, కాన్సెప్ట్‌తో కూడిన చిత్రమిది. అయ్యప్ప మాల నేపథ్యం, అందమైన కుటుంబం, భావోద్వేగాలతోపాటు యాక్షన్ కూడా ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.

# రామ్‌చరణ్‌కు పవన్ బర్త్‌డే విషెష్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా జనసేనాని, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సోషల్ మీడియా వేదికగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. చరణ్ వ్యక్తిత్వం, కృషి, విలువలను ప్రశంసిస్తూ పవన్ రాసిన సందేశం అభిమానులను ఎంతో ఆకట్టుకుంది. నటన పట్ల అంకితభావంతో ప్రతి సినిమాను ఎంతో కష్టపడి పూర్తి చేసే చరణ్ నిబద్ధతను పవన్ ప్రత్యేకంగా కొనియాడారు. వృత్తి పరంగానే కాకుండా, వ్యక్తిగత జీవితంలోనూ చరణ్ ఉన్నతమైన విలువలను పాటిస్తాడని ఆయన పేర్కొన్నారు. కుటుంబ బంధాలకు ఇచ్చే ప్రాధాన్యత, పెద్దల పట్ల గౌరవం, తోటి నటులు మరియు సాంకేతిక నిపుణుల పట్ల చూపించే మర్యాద చరణ్‌ను ప్రత్యేక వ్యక్తిగా నిలబెడతాయని పవన్ అభిప్రాయపడ్డారు.

ముఖ్యంగా చరణ్‌లోని ఆధ్యాత్మికత, దైవభక్తి ఆయనకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చరణ్ మరెన్నో విజయాలు సాధించాలని, ఆయుష్షు, ఆరోగ్యం, ఆనందంతో జీవితాన్ని కొనసాగించాలని దేవుడిని ప్రార్థిస్తూ పవన్ కళ్యాణ్ తన శుభాకాంక్షలను ముగించారు.

తొలి ఆకాంక్ష



### గోదావరిఖని లో అంగరంగ వైభవంగా

# శ్రీ సీతారాముల కళ్యాణం...



గోదావరిఖనిటౌన్//మార్చి 27 (ఆకాంక్ష) : రామగుండం కార్పొరేషన్ పరిధిలోని గోదావరిఖని పట్టణంలోని కాకతీయ నగర్ భక్తాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భద్రాచలం తరహాలో గత 17 సంవత్సరాలుగా నిరంతరం కొనసాగుతున్న ఈ మహోత్సవం ఈ ఏడాది 18వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది.ఆలయ ప్రధాన అర్చకులు బూర్ల గణేష్ ఆధ్వర్యంలో శుక్రవారం అభిజిత్ లగ్నంలో వేదమంత్రాల నడుమ సీతారాముల కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. నూతి అంబాదాసు, నెల్లి లక్ష్మీనారాయణ, పవన శర్మ, ఆదేపు శ్రీరాములు, చాణక్య శర్మ, బండారి రాజమల్లు, శ్రీరాముల శర్మ తదితర వేద పండితులు పాల్గొని పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు తరలివచ్చి కళ్యాణోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో వీక్షించారు. తమ కుటుంబాల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కోసం సీతారాముల సాక్షిగా మొక్కులు చెల్లించారు. తెలంగాణ రాష్ట్రం, దేశంలోని సమస్త ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు ప్రార్థనలు చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు దాట్ల జేమ్స్ రెడ్డి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య యాదవ్, బారసా నాయకులు నీరటి శ్రీనివాస్, గొర్రె నర్సింగరావు, మొలుగూరి మహేష్, కాకతీయ నగర్ బస్తి వాసులు ఉప్పరి మల్లమ్మ, ఆగయ్య, గొర్రె రామచందర్ తదితరులు పాల్గొన్నారు.



### తిరుమల వేంకటేశ్వర ప్రాణాదాన

# ట్రస్టుకు రూ.కోటి విరాళం అందజేత....



తిరుమల//మార్చి 27 (ఆకాంక్ష) : తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోని శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్ట్ మరియు శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు దాతలు భారీగా విరాళాలు అందజేశారు. చెన్నైకి చెందిన ది చెన్నై షాపింగ్ మాల్ అధినేత మర్రి వెంకటరెడ్డి, మర్రి రిటైల్ లిమిటెడ్ సంస్థ పేరిట ప్రాణదాన ట్రస్టుకు రూ.1 కోటి విరాళంగా అందించారు. ఈ విరాళం చెక్కును తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ దాతను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా అన్నప్రసాదం ట్రస్టుకు పలువురు దాతలు కలిపి రూ.60 లక్షలకు పైగా విరాళాలు అందించారు. చెన్నైకు చెందిన రేవతి విశ్వనాథ్ రూ.40 లక్షలు, హైదరాబాద్‌కు చెందిన భవేశ్ చౌదరి రూ.10,07,777, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన పొనకల నాగేంద్రరావు రూ.10 లక్షలు విరాళంగా సమర్పించారు. ఈ సందర్భంగా దాతలు తిరుమలలోని క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరికి విరాళాల డీడీలను అందజేశారు. భక్తుల సేవా కార్యక్రమాల కోసం ట్రస్టులకు అందుతున్న విరాళాలు మరింత సేవా విస్తరణకు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు.

# రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య...

వరంగల్//మార్చి 27 (ఆకాంక్ష) : గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం రాత్రి వరంగల్ చింతలపల్లి రైలు స్టేషన్ల మధ్య ధర్మారం రైల్వే గేట్ సమీపంలో జరిగింది. వరంగల్ జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 35 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి ధర్మారం రైల్వే గేట్ సమీపంలోని మైలురాయి నెంబర్ 382/16-18 వద్ద డౌన్ లైన్‌పై వెళ్తున్న ట్రైన్ నంబర్ 12714 శాతవాహన ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు బ్లూ కలర్ నైట్ ప్యాంట్, సిమెంట్ కలర్ ఫుల్ షర్ట్ ధరించి ఉన్నాడు.రైల్వే అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఎంజీఎం దవాఖాన మార్చురీలో భద్రపరిచి దర్యాప్తు చేపట్టినట్లు హెడ్ కానిస్టేబుల్ పేర్కొన్నాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో అతని మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ మార్చురీ గదిలో భద్రపరిచారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 98497 49220, 8712658627 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

# హైదరాబాద్‌లో అర్ధరాత్రి యువకుడిపై కత్తితో దాడి...



హైదరాబాద్//మార్చి 27 (ఆకాంక్ష) : హైదరాబాద్ నగరంలోని మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి ఘోర సంఘటన చోటుచేసుకుంది. వాంబే కాలనీలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో శుక్రవారం తెల్లవారు జామున సుమారు 2 గంటల సమయంలో వివేక్ అనే యువకుడు రఘుపతి అనే మరో యువకుడిపై కత్తితో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వివేక్ ముందస్తు ప్రణాళిక ప్రకారం రఘుపతిని ఫోన్ చేసి బయటకు పిలిపించుకున్నాడు. అనంతరం ఒంటరిగా వచ్చిన రఘుపతిపై ఒక్కసారిగా మెడపై కత్తితో దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన రఘుపతి రక్తపు మడుగులో పడిపోగా, స్థానికులు గమనించి వెంటనే సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.డాక్టర్లు రఘుపతికి అత్యవసర చికిత్స అందిస్తున్నారని, ప్రస్తుతం అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు సమాచారం. పాత కక్షల నేపథ్యంలోనే ఈ దాడి జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న మైలార్ దేవ్ పల్లి పోలీసులు నిందితుడు వివేక్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### సినీ నటుడు రాహుల్

# రామకృష్ణ కుటుంబంలో విషాదం...

**గడ్డి మందు తాగి సోదరుడు మృతి..**

**పారాక్వాట్‌పై నిషేధం విధించాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి...**

హైదరాబాద్//మార్చి 27 (ఆకాంక్ష) : ప్రముఖ సినీ నటుడు, రచయిత రాహుల్ రామకృష్ణ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆయన సోదరుడు పారాక్వాట్ (ఘుతీునబఖ్) అనే అత్యంత ప్రమాదకరమైన గడ్డి నివారణ మందు కారణంగా మృతిచెందిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఈ విషాద వార్తను సోషల్ మీడియా ద్వారా పంచుకున్న రాహుల్ రామకృష్ణ, ఈ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రభుత్వాలను అప్రమత్తం చేశారు.పారాక్వాట్ అనే రసాయనం అత్యంత ప్రాణాంతకమని, దీనికి ఎటువంటి విరుగుడు లేకపోవడం వల్ల ఇది శరీరంలోకి వెళ్లిన వెంటనే ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, కాలేయంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన వివరించారు. ఇటువంటి ప్రమాదకరమైన రసాయనాలు మార్కెట్లో చాలా సులభంగా లభ్యమవుతున్నాయన్న అంశాన్ని ఆయన ప్రస్తావిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు.ఈ విషప్రయోగం కారణంగా జరిగే మరణాల సంఖ్య వైద్యులను కూడా షాక్‌కు గురిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ అవసరాల పేరుతో ఈ విషం సాధారణ దుకాణాలకే కాకుండా ఈ-కామర్స్ వేదికల్లో కూడా విచ్చలవిడిగా అందుబాటులో ఉందని, దీన్ని ఆత్మహత్యలకు ఎక్కువగా ఉపయోగిస్తున్నారని వెల్లడించారు. ఈ నేపథ్యంలో రాహుల్ రామకృష్ణ ప్రధానమంత్రి కార్యాలయం (ఖీమీ), తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం (జమీ)లకు బహిరంగ విజ్ఞప్తి చేస్తూ పారాక్వాట్‌పై తక్షణమే నిషేధం విధించాలని కోరారు. ఇప్పటికే పలు దేశాలు ఈ రసాయనాన్ని నిషేధించాయని, భారత్‌లో కూడా కఠిన ఆంక్షలు విధించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ ఘటనపై నెటిజన్ల నుంచి విస్తృత స్పందన వ్యక్తమవుతోంది. పారాక్వాట్ వంటి ప్రాణాంతక రసాయనాల విక్రయంపై కఠిన నియంత్రణలు అవసరమని ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం...



మెదక్//మార్చి 27 (ఆకాంక్ష) : మెదక్ జిల్లా పాపన్నపేట మండలం నాగ్సాన్‌పల్లి గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం కనుల పండుగగా, భక్తుల హృదయాలను హత్తుకునే విధంగా ఘనంగా జరిగింది. గ్రామంలోని హనుమాన్ స్వామి సన్నిధిలో నిర్వహించిన ఈ పవిత్ర వేడుకకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పెండ్లి పెద్దలుగా ఎర్రం రవీందర్ గుప్తా, ఆయన సతీమణి సంగీత పీటలపై కూర్చొని స్వామివారి కళ్యాణాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల నడుమ శ్రీ సీతారాముల కళ్యాణం భక్తుల మధ్య భక్తి వాతావరణాన్ని మరింత పెంచింది.కళ్యాణ కార్యక్రమాన్ని కొడుపాక పార్థి పంతులు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించి భక్తులకు ఆధ్యాత్మిక భావాన్ని చేరవేశారు. అనంతరం అన్నప్రసాదాన్ని ఎర్రం రవీందర్ గుప్తా భక్తులకు ఏర్పాటు చేయగా, గ్రామస్థులు ఆనందంగా స్వీకరించారు.గ్రామమంతా పండగ వాతావరణంతో కళకళలాడగా, శ్రీరామనవమి ఉత్సాహ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కన్నుల పండుగగా శ్రీ సీతారాముల కళ్యాణం...



నాగర్ కర్నూల్ టౌన్//మార్చి 27 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లాలోని బిజినేపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ సీతారామాలయాల్లో జరిగిన ఈ కార్యక్రమాలు భక్తులతో కళకళలాడాయి.ఈ సందర్భంగా సర్పంచ్ దంపతులు, ఎంపీటీసీలు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, సంఘసేవకులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో సేవలు చేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని శ్రీ సీతారాముల ఆశీస్సులు ఉండాలని గ్రామ పెద్దలు ఆకాంక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ సమగ్ర ఏర్పాట్లు చేసింది.

## ఎర్రకుంట తండాలో శ్రీ సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహణ...



నాగర్‌కర్నూల్ టౌన్//మార్చి 27 (ఆకాంక్ష) : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల పరిధిలోని ఎర్రకుంట తండా శ్రీ రామాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. గ్రామపంచాయతీ పరిధిలోని జగిన తండాలో రాత్లావత్ మాన్య నాయక్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రాత్లావత్ మాన్య నాయక్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి పది సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ప్రతి సంవత్సరం శ్రీరామనవమి పర్వదినం నాడు సీతారాముల కళ్యాణం, అన్నదానం, తీర్థప్రసాదాల పంపిణీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు, మాజీ సర్పంచులు, గోవిందు నాయక్, బుజ్జి చందులాల్, గోపాల్ నాయక్, కృష్ణా నాయక్, లలితా రవి నాయక్, విజయ్ కుమార్, జ్యోతి చందు నాయక్, శ్రీశైలం సీతారాం, రాజు పిట్యా, బాలు నాయక్ తదితర గిరిజన నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# శ్రీ రామ నవమి సందర్భంగా అన్నదాన కార్యక్రమం...



కొత్తగూడెం//మార్చి 27 (ఆకాంక్ష) : కొత్తగూడెం నియోజకవర్గం కూలీలైన్ అయ్యప్ప ఆటో మొబైల్ సెంటర్ వద్ద శ్రీ రామ నవమి సందర్భంగా భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమములో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ అన్నదాన కార్యక్రమము ఏర్పాటు చేసిన కిషోర్,దుర్గ ప్రసాద్ మాట్లాడుతూ శ్రీ రామ నవమి రోజు అన్నదాన కార్యక్రమము ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని ఆ రాములవారి దయ ప్రతి ఒక్కరి మీద ఉండాలని శ్రీ రాముడిని నమ్ముకున్న వారికి కోరుకున్న వారికి కొంగుబంగారమై, కోరుకున్న కోరికలు నెరవేరతాయని రాముడు దయ ప్రతి ఒక్క కుటుంబంపై ఉండాలని, అందరూ కూడా నిండు నూరేళ్ళు అష్ట ఐశ్వర్యాలతో ఆయువు ఆరోగ్యాలతో పిల్ల పాపాలతో ఆనందంగా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమములో కిషోర్,దుర్గ ప్రసాద్, వేణు, పవన్,రాహుల్, వర్ధన్,అభి, సిద్ధు,శంకర్,సాయి, పవన్ కుమార్ మరియు మహిళలు పాల్గొన్నారు.

### శ్రీరామ నవమి సందర్భంగా

# ఫ్రెండ్స్ పౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ...



గోదావరిఖని టౌన్//మార్చి 27 (ఆకాంక్ష) :రామగుండం నియోజకవర్గంలో శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా శ్రీ కోదండ రామాలయం ఆలయం వద్ద సింగరేణి ఏరియా ఆసుపత్రి ముందు ప్రిన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ మరియు మంచినీళ్ల పంపిణీ చేశారు.ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రౌతు గణేష్ కోలేటి విశాల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.రౌత్ గణేష్ మాట్లాడుతూ...ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాబోయే రోజుల్లో ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తామని ప్రజలకు ఎల్లప్పుడూ తోడుంటామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మీస వికాస్, హనుమాన్ల వెంకటేష్,రిషిక్ మార్క్ ఆశ్రిత్,పవన్,అక్షయ్,బన్నీ,బబ్లు,అభిలాష్,కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. ఫ్రెండ్స్ ఫౌండేషన్ వారు మరి ఇంకేనో సేవా కార్యక్రమాలు చేయాలని మీస వికాస్ తెలిపారు.

# ఘనంగా శ్రీరామనవమి వేడుకలు...



నాగర్ కర్నూల్ టౌన్//మార్చి 27 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లాలోని బిజినేపల్లి మండల పరిధిలో శ్రీరామనవమి పర్వదినాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామాలన్నింటిలోని శ్రీ సీతారామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే ఆలయాలకు భారీగా తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా సీతారాముల కళ్యాణ మహోత్సవాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాల మధ్య పూజారులు



శాస్త్రోక్తంగా కళ్యాణాన్ని జరిపించారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు పెద్ద ఎత్తున పాల్గొని కళ్యాణోత్సవాన్ని కనుల పండుగగా వీక్షించారు.అలాగే కొన్ని గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామాల్లో రామనామ స్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మొత్తంగా బిజినేపల్లి మండలంలో శ్రీరామనవమి వేడుకలు భక్తి పరవశంతో ఘనంగా జరిగాయి.

# వేములవాడలో వైభవంగా శ్రీరామనవమి వేడుకలు...

**భక్తుల రద్దీతో కళకళలాడిన క్షేత్రం...**

స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్...

రాజన్న సిరిసిల్ల//మార్చి 27 (ఆకాంక్ష) : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ పుణ్యక్షేత్రం శ్రీరామనవమి పర్వదినాన భక్తి పరవశంతో కళకళలాడింది. ఈ సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా ప్రారంభమై, వేలాది మంది భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. శుక్రవారం ఉదయం ఆలయానికి చేరుకున్న వారిని అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా ఆహ్వానించి, సంప్రదాయ పద్ధతుల్లో స్వాగతం పలికారు.అనంతరం వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కళ్యాణోత్సవానికి తీసుకువచ్చిన పట్టువస్త్రాలను స్వామివారికి సమర్పించారు. పూజా కార్యక్రమాలు ముగిసిన తరువాత అర్చకులు వారికి వేదాశీర్వచనాలు అందించడంతో పాటు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం అంతా మంగళవాయిద్యాలతో, వేద మంత్రోచ్చారణలతో మారుమోగింది. ఇక ముందుగా ఆలయ అతిథి గృహంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం రాజరాజేశ్వర ఆలయ ఆధ్వర్యంలో శివార్చన స్టేజీ వద్ద నిర్వహించనున్న కళ్యాణ మహోత్సవ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్లు శేఖర్, రాకేష్, ఆర్డీవో రాధాబాయి,ఆలయ ఈఓ రమాదేవి, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్ జయంత్ కుమార్ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.శ్రీరామనవమి సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి, సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించారు.వేములవాడ క్షేత్రంలో జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం భక్తుల హృదయాల్లో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపుతూ ఘన విజయంగా నిలిచింది.

# రాజీతోనే రాజమార్గం..

**రేపు జాతీయ మెగా లోక్ అదాలత్‌కు సిద్ధం కావాలి...**

**ఎల్లారెడ్డిపేట ఎస్సై కె. రాహుల్ రెడ్డి విజ్ఞప్తి...**

రాజన్న సిరిసిల్ల//మార్చి 27 (ఆకాంక్ష) : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట, మార్చి 27: కోర్టుల్లో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవడానికి రాజీ మార్గమే ఉత్తమమైనదని ఎల్లారెడ్డిపేట ఎస్సై కె. రాహుల్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం (మార్చి 28న) నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. వివాదాలను శాంతియుతంగా ముగించేందుకు లోక్ అదాలత్ ఒక సమర్థవంతమైన వేదికగా నిలుస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లోక్ అదాలత్ ద్వారా రాజీకి అనువైన క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి పంపకాల సమస్యలు, కుటుంబ మరియు వైవాహిక తగాదాలు వంటి అనేక అంశాలను పరస్పర చర్చల ద్వారా సులభంగా పరిష్కరించుకోవచ్చన్నారు. అలాగే బ్యాంకు రుణ బకాయిలు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులు వంటి అంశాల్లో కూడా ఇరుపక్షాలు చర్చించుకుని ఏకాభిప్రాయానికి రావచ్చని వివరించారు. లోక్ అదాలత్‌లో కుదిరే రాజీ చట్టపరంగా తుది తీర్పుగా పరిగణించబడుతుందని, దానిపై మళ్లీ అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. ఇరువర్గాల సంపూర్ణ సమ్మతి ఉన్నప్పుడే రాజీ కుదురుతుందని తెలిపారు. దీని ద్వారా కేసుల పరిష్కారంలో ఆలస్యం తగ్గి, బాధితులకు తక్షణ న్యాయం లభిస్తుందని పేర్కొన్నారు.కేసులను రాజీ మార్గంలో ముగించుకోవాలనుకునే కక్షిదారులు వెంటనే ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్సై రాహుల్ రెడ్డి సూచించారు. వివాదాలను వదిలి శాంతి, సామరస్య వాతావరణంలో సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

### కమనీయం రమణీయం

# శ్రీ సీతా రామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం...





గోదావరిఖని//మార్చి 27 (ఆకాంక్ష) : శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గోదావరిఖని పట్టణంలోని కోదండరామాలయంలో శుక్రవారం శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం భక్తుల కళ్లకు కనువిందుగా వైభవంగా నిర్వహించారు. ఆలయం ప్రాంగణం అంతా భక్తజన సందోహంతో కళకళలాడగా, మంగళ వాయిద్యాల నడుమ వేద మంత్రోచ్చారణలతో స్వామివారి కళ్యాణం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా వేద పండితులు మధుసూదనాచార్యుల బృందం ఆధ్వర్యంలో సంప్రదాయ పద్ధతిలో జీలకర్ర బెల్లం కార్యక్రమంతో ప్రారంభమైన వివాహ తంతు కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఆసక్తిగా వీక్షిస్తున్న వేళ, మంత్రోచ్చారణల మధ్య సీతమ్మ మెడలో రామయ్య తాళి కట్టించే పవిత్ర ఘట్టం అత్యంత ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ దంపతులు స్వయంగా తలంబ్రాల బియ్యం, పట్టు వస్త్రాలు తీసుకువచ్చి స్వామివారికి సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. అలాగే జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి దంపతులు, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య దంపతులు, పలువురు కార్పొరేటర్లు మండపంలో కూర్చొని కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో వీక్షించారు.కళ్యాణ మహోత్సవం సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారికి తలంబ్రాలను సమర్పించేందుకు పోటెత్తారు. ఈ క్రమంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఏసీపీ మడత రమేష్ ఆధ్వర్యంలో గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ట్రాఫిక్ సీఐ రాజేశ్వరరావు మరియు పోలీస్ సిబ్బంది కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి భక్తుల రద్దీని సమర్థంగా నియంత్రించారు. రామగుండం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ, రామగుండం మున్సిపల్ అధికారులు, రామాలయం కమిటీ కలిసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేశారు. కళ్యాణ మండపం వద్ద బారికేడ్లు, చల్లని నీటి సౌకర్యం, కూలర్లు ఏర్పాటు చేయడంతో పాటు భక్తులకు సాదర స్వాగతం పలుకుతూ ఆకర్షణీయంగా భారీ ఆర్చ్‌ను ఏర్పాటు చేశారు. వేలాది మంది భక్తుల సమక్షంలో భారీ మండపంలో నిర్వహించిన ఈ శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం గోదావరిఖని పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పి, భక్తుల హృదయాల్లో భక్తి భావాన్ని మరింత పెంపొందించింది.

# రైతులకు తుంపర సేద్య పరికరాల పంపిణీ...



నాగర్ కర్నూల్ టౌన్//మార్చి 27 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాగర్ కర్నూల్ మండలానికి చెందిన రైతులకు తుంపర సేద్య పరికరాలు (స్ప్రింక్లర్ పైపులు)ను ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సబ్సిడీపై అందిన పరికరాలను సద్వినియోగం చేసుకుని తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేసి మెరుగైన దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. నీటి సంరక్షణకు ఇవి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. రైతులు సాంకేతిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# జడ్చర్లలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు...

## శ్రీరామరక్షతో రామగుండం నవనిర్మాణం...

రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్...



గోదావరిఖని//మార్చి 27 (ఆకాంక్ష) : శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గోదావరిఖని శ్రీ కోదండ రామాలయంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం భక్తి శ్రద్ధల నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకలకు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తన సతీమణి మానాలి ఠాకూర్‌తో కలిసి హాజరై సీతారామచంద్రుల కళ్యాణాన్ని తిలకించారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్, మేయర్, డిప్యూటీ మేయర్లు తదితర ప్రజాప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయని, రామగుండం పరిధిలోని ఆలయాల్లో కూడా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళ్యాణోత్సవాలను కనుల పండుగగా జరుపుకుంటున్నారని తెలిపారు. గోదావరిఖని కోదండ రామాలయంలో గత మూడు సంవత్సరాలుగా వైభవంగా శ్రీరామనవమి వేడుకలను నిర్వహిస్తూ వస్తున్నామని పేర్కొన్నారు.వచ్చే సంవత్సరం సీతారాముల కళ్యాణాన్ని మరింత ఘనంగా నిర్వహించేందుకు రూ.2 కోట్లతో శాశ్వత నిర్మాణాలను చేపట్టనున్నట్లు ప్రకటించారు. సీతారాముల సాక్షిగా ఈ హామీ ఇస్తున్నామని తెలిపారు. రాబోయే రెండేళ్లలో రామగుండం నవనిర్మాణం పూర్తై, అద్భుత నగరంగా రూపుదిద్దుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు.రామగుండానికి చుట్టూ రామయ్య, కొండపై 135 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహం, సమ్మక్క-సారలమ్మలు, దర్గా, దారిమైసమ్మలు వంటి దైవిక శక్తులు రక్షగా ఉన్నాయని, ఇక రాక్షసపీడకు అంతమైందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ సందర్భంగా జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్, ఎమ్మెల్యే సతీమణి మానాలి ఠాకూర్ మాట్లాడుతూ శ్రీరామచంద్రుడి కరుణ ఈ ప్రాంత ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

## అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల మెరుపుదాడులు...

ట్రాక్టర్లు, జేసీబీ స్వాధీనం...



మెదక్//మార్చి 27 (ఆకాంక్ష) : జిల్లాలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. రామాయంపేట పట్టణ పరిధిలో శుక్రవారం పోలీసులు ఆకస్మికంగా నిర్వహించిన దాడుల్లో అక్రమంగా తరలిస్తున్న ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో రెండు ట్రాక్టర్లు, ఒక జేసీబీతో పాటు సుమారు ఐదు ట్రిప్పుల ఇసుకను పోలీసులు పట్టుకున్నారు.జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి ఈ దాడులు నిర్వహించినట్లు పోలీసులు వెల్లడించారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇసుక రవాణా చేస్తున్న వారిపై ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. అక్రమ రవాణా ద్వారా ప్రభుత్వానికి నష్టం కలిగించడమే కాకుండా, పర్యావరణానికి కూడా హాని జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరిస్తూ, అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై ప్రజలు సమాచారం అందించాలని, సమాచారదారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని వెల్లడించారు. జిల్లాలో అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అరికట్టేందుకు నిరంతర తనిఖీలు కొనసాగిస్తామని పోలీసులు స్పష్టం చేశారు.

## కన్నుల పండుగగా రాములోరి కళ్యాణం...



నాగర్ కర్నూల్//మార్చి 27 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ పట్టణంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. పట్టణంలోని శ్రీ రామస్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడగా, కళ్యాణోత్సవం కన్నుల పండుగగా సాగింది.ఈ పుణ్య కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల సరితా రాజేష్ రెడ్డి దంపతులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో సేవలు చేశారు. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి కూడా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా జీవించాలని శ్రీ సీతారాముల ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. అలాగే ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉత్సవ కమిటీ చేసిన ఏర్పాట్లను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, స్థానిక కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## రాములవారి కళ్యాణోత్సవంలో

## మజ్జిగ, అరటిపళ్ళ పంపిణీ...



గోదావరిఖనిటౌన్ //మార్చి 27 (ఆకాంక్ష) : శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గోదావరిఖని రాముని గుండాలలో జరుగుతున్న శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో భక్తులకు మిత్ర యూత్ ఆధ్వర్యంలో మజ్జిగ, అరటిపళ్ళను పంపిణీ చేశారు.వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఉపశమనం కలిగించే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రామగుండం ఎస్సై సంధ్యారాణి మాట్లాడుతూ, సీతారాముల కళ్యాణ వేడుకల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా మజ్జిగ, పండ్ల పంపిణీ చేయడం అభినందనీయమని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలలో యువత ముందుండి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆమె సూచించారు.అనంతరం ఠాకూర్ అయోధ్య సింగ్ ఎస్సై సంధ్యారాణిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మిత్ర యూత్ సభ్యులు ఇరికిల్ల సాయికిరణ్, గుర్రం సాయి, ఇరికిల్ల సాయి, ఇరికిల్ల తేజ, సుందిళ్ల మధు, ఇరికిల్ల ప్రణయ్, ఇరికిల్ల సందీప్, పెరుక అశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్స్ వివేక్ గ్యాస్ట్రో, లివర్

## ఎండోస్కోపి సెంటర్ ప్రారంభం...



నాగర్ కర్నూల్//మార్చి 27 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో మినీ ట్యాంక్ బండ్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్స్ వివేక్ గ్యాస్ట్రో, లివర్ & ఎండోస్కోపి సెంటర్ హాస్పిటల్‌ను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఆధునిక వైద్య సదుపాయాలతో ప్రారంభమైన ఈ ఆసుపత్రి జిల్లాలోని ప్రజలకు మెరుగైన గ్యాస్ట్రో మరియు లివర్ సంబంధిత చికిత్సలను అందించనుందని ఎమ్మెల్యే తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు మెరుగైన వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇటువంటి ప్రత్యేక వైద్య కేంద్రాలు ఏర్పాటు కావడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యమే ప్రధాన సంపద అని, నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండడం సమాజ అభివృద్ధికి కీలకమని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, స్థానిక కౌన్సిలర్లు, వివిధ పార్టీ నాయకులు, ప్రముఖులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన వైద్య పరికరాలను పరిశీలించి వైద్య సిబ్బందిని అభినందించారు. ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కేంద్రం ప్రారంభించబడిందని నిర్వాహకులు తెలిపారు. జిల్లాలో వైద్య రంగం మరింత అభివృద్ధి చెందేందుకు ఇటువంటి ఆసుపత్రులు ముందుకు రావాలని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.

## జడ్చర్లలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు...

గ్రామాలు మొత్తం భక్తి సందడితో కళకళ...



జడ్చర్ల//మార్చి 27 (ఆకాంక్ష) : జడ్చర్ల నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలు, గ్రామాల్లో శ్రీరామనవమి పర్వదినం అత్యంత భక్తి శ్రద్ధలతో శుక్రవారం ఘనంగా నిర్వహించబడింది. ప్రతి గ్రామంలోని శ్రీ సీతారామాలయాలు పండుగ వాతావరణంతో కళకళలాడగా, భక్తుల రద్దీతో ఆలయాలు కిటకిటలాడాయి.ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాముల కళ్యాణ మహోత్సవం ప్రతి గ్రామంలో వైభవంగా జరగగా, మంగళ వాయిద్యాల నడుమ సంప్రదాయ పద్ధతుల్లో వేడుకలు నిర్వహించారు. మహిళలు, పురుషులు, పిల్లలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కళ్యాణాన్ని కనుల పండుగలా వీక్షించారు.గ్రామ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, విద్యావేత్తలు, గ్రామ పెద్దలు, యువజన సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. శ్రీరామ్ జయరామ్ జయ జయ రామ్” అనే నామస్మరణతో ఆలయాలు మార్మోగగా, గ్రామాలన్నింటిలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో, పూలతో అలంకరించి ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. పూలతో అలంకరించిన మండపాల్లో సీతారాముల కళ్యాణం అత్యంత ఆకర్షణీయంగా నిర్వహించారు. పూజారులు వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా కళ్యాణోత్సవాన్ని నిర్వహించగా భక్తులు హారతులు తీసుకుంటూ స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. కొన్ని గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. యువత సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించారు. మహిళలు కోలాటాలు, భక్తి గీతాలతో ఉత్సాహాన్ని రెట్టింపు చేయగా, పిల్లలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని పండుగకు మరింత అందాన్ని తీసుకొచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శ్రీరాముని జీవితం ఆదర్శప్రాయమని, ఆయన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. జడ్చర్లలో జరిగిన వేడుకల్లో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్, మిడ్జిల్ మండలంలో బాదేపల్లి మార్కెట్ చైర్మన్ జ్యోతి అల్వాల్ రెడ్డి పాల్గొన్నారు.బాలనగర్, నవాబుపేట్, రాజాపూర్ మండలాల పరిధిలోని గ్రామాల్లో కూడా శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణం భక్తి పరవశంతో వైభవంగా నిర్వహించబడింది. ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతూ పండుగ సందడి నెలకొనగా, ఈ వేడుకలు గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక ఆనందాన్ని నింపాయి.



## మేడిపూర్ గ్రామంలో రైతులకు పరికరాల పంపిణీ...



నాగర్ కర్నూల్//మార్చి 27 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లా తాడూర్ మండలంలోని మేడిపూర్ గ్రామంలో రైతుల అభివృద్ధికి తోడ్పడే పలు వ్యవసాయ పరికరాలను ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. కూరగాయల సాగుకు ఉపయోగపడే ప్లాస్టిక్ ట్రేలు, సేంద్రియ ఎరువుల తయారీకి వర్మీ కంపోస్ట్ బెడ్లు, అలాగే అదనపు ఆదాయ వనరుగా తేనెటీగల పెంపకానికి అవసరమైన బాక్సులను రైతులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాల్సిన అవసరం ఉందని సూచించారు. సేంద్రియ వ్యవసాయం, కూరగాయల సాగు, తేనెటీగల పెంపకం వంటి అనుబంధ రంగాలపై దృష్టి సారించడం ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రతి రైతు ఆర్థికంగా బలపడేలా పలు పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రాజూ చైర్మన్ రామచంద్ర రెడ్డి, తాడూర్ సర్పంచ్ మల్లయ్య, మేడిపూర్ సర్పంచ్ మల్లయ్య, గ్రామ నాయకులు, కార్యకర్తలు మరియు రైతులు పాల్గొన్నారు.

## పులిహోర ప్రసాదానికి రైస్ బ్యాగులు,

## ముడి సరుకుల పంపిణీ...



గోదావరిఖని//మార్చి 27 (ఆకాంక్ష) : శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలోని రాం మందిర్‌లో ఉన్న శ్రీ రామాలయంలో నిర్వహించిన శ్రీరామనవమి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గత 12సంవత్సరాలుగా కొనసాగుతున్న ఆనవాయితీ ప్రకారం గోదావరిఖని కిరాణా మర్చంట్ అసోసియేషన్ మరియు రైస్ మిల్లర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులకు ఉచితంగా పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు.ఈ సంవత్సరం కూడా రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ నాయకత్వంలో, మేయర్ మహంకాళి స్వామి, కోదండ రామాలయం చైర్మన్ గట్ల రమేష్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ప్రత్యేక పూజలు, హారతులు, సీతారాముల కళ్యాణ మహోత్సవం నిర్వహించగా, అనంతరం భక్తులకు ప్రసాదంగా పులిహోర పంపిణీ చేపట్టారు.పులిహోర ప్రసాదం తయారీకి అవసరమైన రైస్ బ్యాగులు, పప్పులు, నువ్వులు, నూనె, ఇతర ముడి సరుకులను కిరాణా మర్చంట్ అసోసియేషన్, రైస్ మిల్లర్ అసోసియేషన్ సభ్యులు అందజేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసి, శుభ్రతా ప్రమాణాలు పాటిస్తూ ప్రసాదాన్ని అందించారు. వేలాదిమంది భక్తులు ఈ సేవా కార్యక్రమాన్ని అభినందిస్తూ ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో కిరాణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు చొక్కారపు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చిట్టిమల్ల కిషోర్, సభ్యులు కుమార్, కోశాధికారి రేణికుంట చందర్, ఉపాధ్యక్షులు నగునూరి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన అందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## భక్తుల దాహార్తిని తీర్చిన ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ సేవలు...



గోదావరిఖని//మార్చి 27 (ఆకాంక్ష) : శ్రీ రామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గోదావరిఖనిలో భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు విశేష సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గత 25 సంవత్సరాలుగా నిరంతరంగా కొనసాగిస్తున్న ఈ సేవలో భాగంగా మజ్జిగ, బెల్లం పానకం, పులిహోర ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం సందర్భంగా ఎండ తాకిడి తీవ్రంగా ఉండటంతో, భక్తుల కోసం చల్లని మజ్జిగ, శీతల పానీయాల పంపిణీ చేపట్టడం విశేషం. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తులకు ఎంతో ఉపశమనాన్ని కలిగించింది.ఈ సందర్భంగా గోదావరిఖని ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ, భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంపై భక్తులు కూడా ఆనందం వ్యక్తం చేస్తూ, అసోసియేషన్ సభ్యులను ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి భాస్కర్, ప్రధాన కార్యదర్శి శనిగరపు మల్లేష్, కోశాధికారి బండారి ప్రసాద్‌తో పాటు కోడిపల్లి వాసు రావు, గట్టు భీష్మ కుమార్ గౌడ్, రామగిరి శ్రీనివాస్, మునుకుంట్ల శ్రీనివాస్, బిసాడి శివప్రసాద్, ఆరెల్లి శ్రీధర్ గౌడ్, తోగటి శ్రీధర్, రాగుల రాము, గూడేలి శ్రీనివాస్, రుద్రారపు మోహన్, చిప్పకుమారస్వామి, గడమల్ల రఘు, పల్లె కుమార్, మోర విక్రమ్, గౌడ రమేష్, శివకుమార్, సురేష్ బాబు, తిరుపతి తదితర ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.ం

## పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన

## యువకుడిపై కేసు నమోదు...

జడ్చర్ల//మార్చి 27 (ఆకాంక్ష) : మిడ్జిల్ గ్రామంలో యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన ఓ యువతి ఫిర్యాదు మేరకు ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం, మిడ్జిల్ గ్రామానికి చెందిన యువతి మరియు అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మధ్య గత 10 సంవత్సరాలుగా పరిచయం కొనసాగుతోంది. ఈ క్రమంలో పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. యువకుడు ఇచ్చిన హామీలను నమ్మిన యువతి అతనితో సన్నిహితంగా ఉండగా, ఆమె గర్భవతిగా మారినట్లు ఫిర్యాదులో పేర్కొంది.తర్వాత పెళ్లి చేసుకోవడాన్ని తప్పించుకుంటూ బాధితురాలిని నిర్లక్ష్యం చేయడంతో, యువతి పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై శివ నాగేశ్వర్ నాయుడు తెలిపారు.ఈ ఘటన గ్రామంలో చర్చనీయాంశంగా మారగా, బాధితురాలికి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు. పోలీసులు కేసును దర్యాప్తు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## సర్పంచ్ ఉదారత.

రామాలయానికి 16 లక్షల విలువైన స్థల బహుకరణ...




నాగర్ కర్నూల్ టౌన్//మార్చి 27 (ఆకాంక్ష) : శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని బిజినేపల్లి మండలం పాలెం గ్రామంలో సర్పంచ్ బోనాసి రామకృష్ణ తన ఉదారతను చాటుకున్నారు. గ్రామంలోని రామాలయ అభివృద్ధి కోసం రూ.16 లక్షల విలువైన 288 గజాల స్థలాన్ని బహుకరిస్తున్నట్లు ప్రకటించారు. శుక్రవారం రామాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అనంతరం కళ్యాణ వేదికపై నుంచి గ్రామ పెద్దలు, భక్తజనుల సమక్షంలో ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామకృష్ణ మాట్లాడుతూ, తన తండ్రి బోనాసి కాశన్న జ్ఞాపకార్థంగా ఈ స్థలాన్ని ఆలయానికి అందిస్తున్నట్లు తెలిపారు.స్థలానికి సంబంధించిన దస్తావేజులను ప్రముఖ పారిశ్రామికవేత్త జున్న శేఖర్ రెడ్డి దంపతులకు అందజేశారు. ఈ 288 గజాల విశాల స్థలం కేటాయింపుతో రామాలయ ప్రాంగణం మరింత విస్తరించి, భవిష్యత్తులో జరిగే ధార్మిక కార్యక్రమాలకు సౌకర్యవంతంగా మారనుంది.ఇటీవల సర్పంచ్‌గా ఎన్నికైన రామకృష్ణ ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్ దంపతులు, జున్న శేఖర్ రెడ్డి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, పతంజలి సమితి రాష్ట్ర అధ్యక్షులు వస్పరి శివుడు, వట్టెపు నాగయ్య, సొప్పరి బాలస్వామి, గాడి సురేందర్, పెద్ద కుర్మయ్య, రవీందర్ రెడ్డి, కుమ్మరి స్వామి తదితరులు సర్పంచ్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

## ఓదెలలో ఘనంగా

## శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణోత్సవం...



ఓదెల//మార్చి 27 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఓదెలలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారామచంద్రస్వామి వారి కళ్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఓదెల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం పరిసర ప్రాంతంలో గుంపుల మానేరు నది తీరాన ఉన్న శ్రీ రామభద్ర దేవస్థానంలో ఈ పవిత్ర వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి.ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా కళ్యాణోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని పుణ్యఫలాన్ని పొందారు. వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య సీతారాముల కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.కళ్యాణ వేడుకలు ప్రారంభమైన వేళ ఆలయ పరిసరాలు మంగళ వాద్యాలతో మారుమోగాయి. స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేసి, పుష్పాలతో అందంగా తీర్చిదిద్దారు. కళ్యాణ సమయంలో పూజారులు వేద మంత్రాలతో యజ్ఞ కార్యక్రమాలను నిర్వహించగా భక్తులు హర్షధ్వానాలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం అంతా ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. స్వామివారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భద్రతా చర్యలు కూడా కట్టుదిట్టంగా అమలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు సేవలందించారు.ఓదెలలో జరిగిన ఈ శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణోత్సవం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించడంతో పాటు, పర్వదినానికి ప్రత్యేక శోభను తీసుకొచ్చింది.

## ఘనంగా శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణోత్సవం...

ఓదెల//మార్చి 27 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఓదెలలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ సీతారామచంద్రస్వామి వారి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఓదెల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం సమీపంలో గల గుంపుల మానేరు నది తీరాన ఉన్న శ్రీ రామభద్ర దేవస్థానంలో ఈ మహోత్సవం కన్నుల పండుగగా సాగింది.ఉదయం నుంచే ఆలయానికి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేద పండితులు వేద మంత్రోచ్చారణల నడుమ సంప్రదాయబద్ధంగా కళ్యాణోత్సవాన్ని నిర్వహించగా, ఆలయ ప్రాంగణం అంతా ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. స్వామివారి కళ్యాణాన్ని తిలకించిన భక్తులు హర్షాతిరేకాలకు లోనయ్యారు.ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని ప్రార్థించి రాష్ట్ర ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని కోరుకున్నారు. ఆలయ అధికారులు భక్తులకు తగిన ఏర్పాట్లు చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.మొత్తంగా శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణోత్సవం ఓదెలలో భక్తి పారవశ్యంతో, వైభవంగా కొనసాగింది

## ఎక్లాస్‌పూర్‌లో వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం...





అంతర్గాం//మార్చి 27 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల భక్తులు భారీగా తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. వేద మంత్రాల నడుమ పండితులు సంప్రదాయబద్ధంగా కళ్యాణోత్సవాన్ని నిర్వహించగా, ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది.ఎక్లాస్‌పూర్ గ్రామంలోని ఈ శ్రీ రాములవారి ఆలయం వందల సంవత్సరాల చరిత్ర కలిగి ఉండి, ఎంతో ప్రతిష్ట కలిగిన క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయంలో పూజలు చేస్తే కోరుకున్న కోరికలు నెరవేరుతాయని విశ్వాసంతో తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుండి వేలాదిమంది భక్తులు సంవత్సరాలుగా ఇక్కడికి విచ్చేస్తున్నారు. స్వయంగా భక్తులే తమ అనుభవాలను పంచుకుంటూ ఈ దేవాలయ మహిమను తెలియజేస్తుండటం విశేషం.గ్రామ పరిసర ప్రాంతం ఆధ్యాత్మికంగా ప్రత్యేకతను సంతరించుకుంది. ఒక వైపు గుట్టపై దేవాలయం, మరొక వైపు మరో దేవాలయం, మధ్యలో శ్రీ రాములవారి ఆలయం, సమీపంలోని కండిగుట్టలో ఆంజనేయస్వామి ఆలయం ఉండటంతో ఈ ప్రాంతం ఆధ్యాత్మిక క్షేత్రంగా గుర్తింపు పొందుతోంది. ఈ విశిష్టత కారణంగా ఎక్లాస్‌పూర్ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని స్థానిక ప్రజలు అభిలషిస్తున్నారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, భక్తులు రామగుండం నియోజకవర్గ శాసన సభ సభ్యులు ఠాకూర్ మక్కన్ సింగ్ ని ప్రత్యేకంగా కోరుతూ, ఈ ఆలయ పరిసర ప్రాంతాన్ని అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, యువకులు సమిష్టిగా ముందుండి నిర్వహించడం విశేషం.యువకులు సేవాభావంతో ముందుకు వచ్చి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించగా, గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ మహోత్సవంలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాదం, తీర్థప్రసాదం పంపిణీ చేయడంతో పాటు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మొత్తంగా ఎక్లాస్‌పూర్ గ్రామంలో జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణం భక్తుల హృదయాల్లో ఆధ్యాత్మిక ఆనందాన్ని నింపింది.

## డిప్రెషన్, దృష్టి లోపం..

## ఈ రెండూ గుండెకు ముప్పే. తాజా అధ్యయనం

మారుతున్న జీవనశైలిలో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక స్థితి, ఇంద్రియాల పనితీరు కూడా గుండె ఆరోగ్యంపై పెను ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా మానసిక కుంగుబాటు కంటి చూపు మందగించడం అనేవి విడివిడిగానే కాకుండా, కలిస్తే గుండె జబ్బుల ముప్పును ప్రమాదకర స్థాయికి తీసుకెళ్తాయని తాజా అంతర్జాతీయ అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి.

ఇది కూడా చదవండి..లవ్ హార్మోన్ అంటే ఏమిటి.. ఇది కూడా చదవండి..రాత్రి 9 గంటల తర్వాత డిన్నర్ చేయడం వల్ల కలిగే నష్టాలు ఇవే.. ఇది కూడా చదవండి..వేగంగా బరువు తగ్గించే ఓట్జెంపిక్ డ్రింక్ ట్రెండ్.. డైటీషియన్లు ఏమంటున్నారంటే.. చైనాలోని మిడిల్ ఏజ్డ్ , వృద్ధులపై నిర్వహించిన ఒక భారీ స్థాయి పరిశోధన ప్రకారం.. డిప్రెషన్ ఉన్నవారిలో గుండె జబ్బులు వచ్చే అవకాశం దాదాపు 60 శాతం ఎక్కువగా ఉంది. అలాగే, దృష్టి లోపంతో బాధపడుతున్న వారిలో ఈ ముప్పు 25 శాతం అధికంగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు.

ముప్పు పెరగడానికి కారణాలివే..

ఈ రెండూ నేరుగా, పరోక్షంగా గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి.కంటి చూపు సరిగా లేని వారు లేదా మానసిక కుంగుబాటులో ఉన్నవారు వ్యాయామం చేయడానికి, బయట తిరగడానికి ఇష్టపడరు. ఇది ఊబకాయం, రక్తపోటుకు దారితీసి గుండెపై ఒత్తిడి పెంచుతుంది. డిప్రెషన్ వల్ల శరీరంలో ఒత్తిడి హార్మోన్లు (కొతీవంం ఎశీతీఎశీఅవం) పెరిగి, గుండె కండరాలకు రక్తప్రసరణను అడ్డుకోవచ్చు. కుంగుబాటులో ఉన్నవారు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించలేక, క్రమం తప్పకుండా వాడాల్సిన మందులను నిర్లక్ష్యం చేస్తారు. ఇది ప్రమాదాన్ని మరింత పెంచుతుంది.

రెగ్యులర్ స్క్రీనింగ్..

45 ఏళ్లు పైబడిన వారు కేవలం బీపీ, షుగర్ మాత్రమే కాకుండా, కంటి చూపు, మానసిక స్థితిని కూడా ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలి. గుండె జబ్బులు రాకుండా ఉండాలంటే కేవలం ఆహార నియమాలు పాటిస్తే సరిపోదు; మానసిక ప్రశాంతత, మెరుగైన దృష్టి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఒంటరితనం డిప్రెషన్‌ను పెంచుతుంది కాబట్టి, కుటుంబ సభ్యులు, స్నేహితులతో సమయం గడపడం ఉత్తమం. మొత్తానికి, 'కంటిని.. మనసుని' క్షేమంగా ఉంచుకుంటేనే 'గుండె' పదికాలాల పాటు పదిలంగా ఉంటుందని ఈ అధ్యయనం స్పష్టం చేస్తోంది.

ఇది కూడా చదవండి..హార్ట్ ఎటాక్ తర్వాత తొలి 60 నిమిషాలు ఎందుకంత కీలకం..ఇది కూడా చదవండి..విటమిన్ సి లోపించినప్పుడు కనిపించే ముఖ్య లక్షణాలు ఇవే.. ఇది కూడా చదవండి..ఓఆర్ఎస్ ఆరోగ్యానికి మంచిదేనా.. ఎనర్జీ డ్రింక్స్ వల్ల కలిగే అనారోగ్య సమస్యలు.. ఇది కూడా చదవండి..చీవష శరీరానికి అవసరమయ్యే నీటి పరిమాణంలో కొత్త మార్గదర్శకాలు.. ఇది కూడా చదవండి..ఎలాంటి కొలెస్ట్రాల్ ఆరోగ్యానికి హానికరం..

గమనిక: ఇది కేవలం సమాచారంగా మాత్రమే భావించండి.. ఈ సమాచారం ఆధారంగా ఆరోగ్య సమస్యలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవద్దు. అందుకోసం వైద్య నిపుణులను సంప్రదించండి.

## మొండి పుండ్లకు జెల్ చికిత్స!

## తాజా అధ్యయనంలో కీలక విషయాలు!

### పుండు మానడంలో ఆక్సిజన్ ది కీలక పాత్ర - పరిశోధకులు ఏం చెప్తున్నారంటే!

ఎంతకీ మానని మొండి పుండ్లు పెద్ద సమస్య. వీటికి చికిత్స చేయటం చాలా కష్టం. ఒకవేళ పుండ్లు మానకపోతే పాదాలు, వేళ్లు తొలగించాల్సిన పరిస్థితీ తలెత్తుతుంది. రోజు రోజుకీ వృద్ధులు, డయాబెటిస్ బాధితుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో మొండి పుండ్ల కొత్త చికిత్సలకూ ప్రాధాన్యం ఏర్పడుతోంది. దీని విషయంలో యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, రివర్‌సైడ్ రూపొందించిన జెల్ పట్టీ వ్యవస్థ కొత్త ఆశలు రేపుతోంది. గాయమైన చోట లేదా పుండ్లు ఉన్న చోట నిరంతరం ఆక్సిజన్ సరఫరా చేయటం ద్వారా పుండ్లు మానేలా చేయటం దీని ప్రత్యేకత. మరి, అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం!

ఆక్సిజన్ పాత్ర :

మామూలుగా నాలుగు వారాల్లోపు నయం కాని పుండ్లను మొండిపుండ్లుగా భావిస్తుంటారు. ఈ రకం పుండ్లు నెలల కొద్దీ మానకుండా వేధిస్తుంటాయి. వీటితో ఇన్‌ఫెక్షన్ ఎక్కువ కావటం, హాస్పిటల్‌లో చేరాల్సి రావటం వంటి జరుగుతుంటాయి. కొన్ని సార్లు కాళ్లూ, చేతుల వంటివి తొలగించాల్సిన పరిస్థితీ కూడా ఏర్పడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా సుమారు 1.2 కోట్ల మంది మొండి పుండ్ల బారినపడుతున్నారని నివేదికలు అంచనా వేస్తున్నాయి. వీరిలో సుమారు 20 శాతం మందికి పాదాలు, వేళ్ల వంటివి తొలగించాల్సిన పరిస్థితి తలెత్తుతుందని పేర్కొన్నాయి. పుండ్లు మానకపోవటానికి ఒక ప్రధాన కారణం.. ఆ భాగానికి తగినంతగా, స్థిరంగా ఆక్సిజన్ అందకపోవటమే అంటున్నారు నిపుణులు. సాధారణంగా పుండు 4 దశలు ద్వారా మానుతుంటున్నారు నిపుణులు. ముందు వాపు ప్రక్రియ తలెత్తుతుందని, ఆ తర్వాత కొత్త రక్తనాళాలు పుట్టుకొస్తాయని పేర్కొంటున్నారు. అనంతరం కణజాలం తిరిగి కుదురుకుంటుందని తెలియజేస్తున్నారు. ఆఖరికి కొత్త కణజాలం ఏర్పడుతుందని వివరిస్తున్నారు. ఈ క్రమంలో అన్ని దశల్లోనూ ఆక్సిజన్ పాత్ర కీలకమంటున్నారు. ఆక్సిజన్ తగినంత అందకపోతే వాపు ప్రక్రియ ఎక్కువ కాలం కొనసాగుతుందని చెబుతున్నారు. ఇది బ్యాక్టీరియా వృద్ధి చెందటానికి, ఇన్‌ఫెక్షన్ తలెత్తటానికి అనువైన వాతావరణం కల్పిస్తుందని తెలియజేస్తున్నారు. మరోవైపు కణజాలం తిరిగి కోలుకునే ప్రక్రియ కూడా నిలిచిపోతుందని వెల్లడిస్తున్నారు. దెబ్బతిన్న కణజాలం లోతుల్లోకి ఆక్సిజన్ చేరకపోతే మరింత సమస్యంగా మారుతుందని హెచ్చరిస్తున్నారు. దీన్ని పరిష్కరించటానికే పరిశోధకులు కొత్త జెల్ వ్యవస్థను రూపొందించారు. మెత్తగా, మృదువుగా ఉండే ఇది గాయమైన భాగం వద్దే నిరంతరం నేరుగా ఆక్సిజన్‌ను సృష్టిస్తుందంటున్నారు పరిశోధకులు.

ఎలా పనిచేస్తుంది :

జెల్ పట్టీలో నీరు, కొలిన్ ఆధారిత ద్రవం ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. యాంటీ బ్యాక్టీరియా గుణం గల కొలిన్ ఆధారిత ద్రవం సురక్షితమైందని, తనకు తానే క్షీణిస్తుందని అంటున్నారు. వినికిడి సాధనాల్లో ఉండేటువంటి చిన్న బ్యాటరీతో అనుసంధానమైనప్పుడు ఈ వ్యవస్థ చిన్న విద్యుత్ రసాయన పరికరంగా మారుతుందని పేర్కొంటున్నారు. అప్పుడు నీటి అణువులు విడిపోయి నెమ్మదిగా, అవసరమైనంత మేరకు ఆక్సిజన్ పుట్టుకొస్తూ ఉంటుందని వివరిస్తున్నారు. ద్రవాలను పీల్చుకునే లేదా యాంటీ మైక్రోబియల్ పదార్థాలతో కూడిన సంప్రదాయ పుండ్ల పట్టీల మాదిరిగా కాకుండా ఇది ఆక్సిజన్ లేమి సమస్యను పరిష్కరించటం ద్వారా పనిచేస్తుందని తెలియజేస్తున్నారు. ముందుగా పుండు ఆకారాన్ని కచ్చితంగా మార్చి, ఆక్సిజన్ మోతాదులు తక్కువగా ఉన్నచోట పగుళ్లను పూడ్చివేస్తుందని చెబుతున్నారు. దీంతో ఇన్‌ఫెక్షన్ ముప్పు గణనీయంగా తగ్గుతుందని అంటున్నారు. నిరంతరం ఆక్సిజన్ సరఫరా కావటం వల్ల రక్తనాళాలూ త్వరగా పుట్టుకొస్తాయని, ఫలితంగా పుండు వేగంగా మానుతుందని సూచిస్తున్నారు.

ఆశాజనక ఫలితాలు :

వినూత్న జెల్ పట్టీని డయాబెటిస్ గల, వృద్ధ ఎలుకల మీద ప్రయోగించి, పరిశీలించారు పరిశోధకులు. ఎందుకంటే, వీటి పుండ్లు వృద్ధుల్లో తలెత్తే దీర్ఘకాల పుండ్లనే పోలి ఉన్నాయంటున్నారు. చికిత్స చేయకపోతే పుండు మానదని, ప్రాణాంతకంగానూ పరిణమిస్తుందని హెచ్చరిస్తున్నారు. అందుకే,

## సింగరేణి వ్యాప్తంగా మెడికల్ బోర్డు నిర్వహణలో నిర్లక్ష్యం...

### కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వ వైఖరిపై తీవ్ర అసంతృప్తి...

### తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు...

### తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి...



గోదావరిఖని//మార్చి 27 (ఆకాంక్ష) : సింగరేణి వ్యాప్తంగా మెడికల్ బోర్డు నిర్వహణలో నిర్లక్ష్యం, కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వ వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సంఘం అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు 13 వేల నియామకాల్లో అవకతవకలు జరిగాయని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత కేవలం 1900 నియామకాలు మాత్రమే జరిగాయని, గత రెండు సంవత్సరాలుగా విజిలెన్స్ మరియు ఏసీబీ విచారణలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులను మెడికల్ బోర్డుకు పిలవకుండా, మెడికల్ బోర్డు వ్యవస్థను నిలిపివేయడానికి ప్రభుత్వం మరియు అధికారులు కలిసి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నెలకు మూడు మెడికల్ బోర్డులు నిర్వహిస్తామని ఇచ్చిన హామీలను విస్మరించి కార్మికులను మోసం చేసిందని విమర్శించారు.సుమారు 2000 మంది సింగరేణి కార్మికులు అనారోగ్యంతో బాధపడుతూ, గత పది నెలల సర్వీస్ మిగిలి ఉన్నప్పటికీ సంవత్సరం కాలంగా మెడికల్ బోర్డు కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. రెగ్యులర్ మెడికల్ బోర్డు లేకపోవడంతో అనేక మంది కార్మికులు దీర్ఘకాలిక వ్యాధులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.విజిలెన్స్, ఏసీబీ విచారణల పేరుతో కాలయాపన చేస్తూ కార్మికుల సమస్యలను పక్కనపెడుతున్నారని ఆరోపిస్తూ, సింగరేణి సంస్థలో జరుగుతున్న అవినీతి, నిధుల దుర్వినియోగంపై కార్మిక వర్గం మేల్కొని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సంస్థను పరిరక్షించుకునేందుకు సమిష్టిగా ముందుకు రావాలని, సింగరేణి భవన్, ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమాలకు సిద్ధంగా ఉండాలని సూచించారు.ఈ నేపథ్యంలో నిరసన కార్యక్రమాల షెడ్యూల్‌ను ప్రకటిస్తూ, మార్చి 28న అన్ని మైన్స్ మరియు డిపార్ట్మెంట్లలో నల్ల బ్యాడ్జీలతో నిరసనలు నిర్వహించబడతాయని తెలిపారు. అలాగే మార్చి 30న అన్ని ఏరియాల్లో జీఎం కార్యాలయాల ముందు భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.సింగరేణి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ఈ నిరసనల్లో పాల్గొని తమ హక్కుల కోసం పోరాడాలని సంఘం నాయకత్వం పిలుపునిచ్చింది.

## పెనుమాడ గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా

## ఘనంగా ముగ్గుల పోటీలు.



కృష్ణగిరి//మార్చి 27 (ఆకాంక్ష) : కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గంలోని కృష్ణగిరి మండల పరిధిలోని పెనుమాడ గ్రామంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా మహిళలకు ఉత్సాహాన్ని కలిగించేలా ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు.గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం పండగ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చింది.పండుగ రోజు ఉదయం నుంచే గ్రామంలోని వీధులు రంగురంగుల ముగ్గులతో కళకళలాడాయి.చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ పాల్గొని



గ్రామాన్ని ఒక పండుగ వేదికలా మార్చారు.ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. భక్తి, సాంప్రదాయం, కళల సమ్మేళనంగా జరిగిన ఈ ముగ్గుల పోటీలు గ్రామస్థులను ఆకట్టుకున్నాయి.ఈ పోటీలలో భాగంగా విజేతలకు ఆకర్షణీయమైన



నగదు బహుమతులను ప్రకటించారు.మొదటి బహుమతిగా రూ. 2,500, రెండో బహుమతిగా రూ. 1500 మూడో బహుమతిగా రూ. 1,000, నాలుగో బహుమతిగా రూ. 500, ఐదో బహుమతిగా రూ. 500లను ఆరో బహుమతి 500 నిర్ణయించారు.పోటీలో పాల్గొన్న



మహిళలందరూ ఎంతో ఉత్సాహంతో తమ ముగ్గులను అలంకరించి పోటీని మరింత అందంగా తీర్చిదిద్దారు.ఈ పోటీలో మొదటి



బహుమతిని 2500 గెలుచుకోగా, మిగతా నలుగురు మహిళలు రెండో, మూడో, నాలుగో, ఐదో బహుమతులను



అందుకున్నారు.శ్రీరామనవమి సందర్భంగా గ్రామమంతా భక్తి వాతావరణంతో నిండిపోయింది. శ్రీరామ నామస్మరణతో గ్రామ వీధులు మార్మోగిపోయాయి. పండుగ సందర్భంగా గ్రామ ప్రజలు కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రామ ఐక్యతను ప్రతిబింబించింది.పల్లెల్లో పండగ అంటే ఎలా ఉండాలో చూపించేలా ఈ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించడం విశేషంగా నిలిచింది.మహిళలకు ప్రోత్సాహం కలిగించేలా ముగ్గుల పోటీలు నిర్వహించిన గ్రామ పెద్దలకు, నిర్వాహకులకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా నిర్వహించాలని గ్రామస్తులు కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇండియాలో 'సైలెంట్ ఎపిడెమిక్'గా మారుతున్న నిద్ర రుగ్మతలు..!



నేటి ఆధునిక జీవనశైలిలో నిద్ర అనేది ఒక విలాసంగా మారిపోతోంది. రక్తపోటు, మధుమేహం వంటి పరీక్షలు చేయించుకునే మనం.. 'రాత్రి సరిగ్గా నిద్రపోతున్నామా..' అనే విషయాన్ని మాత్రం విస్మరిస్తున్నాం. మార్చి 13న 'ప్రపంచ నిద్ర దినోత్సవం' సందర్భంగా వైద్య నిపుణులు వెల్లడించిన గణాంకాలు భారతీయుల ఆరోగ్య స్థితిగతులపై ఆందోళన కలిగిస్తున్నాయి. దేశంలో లక్షలాది మంది నిద్ర రుగ్మతలతో బాధపడుతున్నారని, ఇది గుండె జబ్బులు, మధుమేహం, డిప్రెషన్‌కు దారితీస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది కూడా చదవండి..సింన్డ్రోమ్ శకు ప్రారంభ దశలో ఎలాంటి చికిత్సను అందిస్తారు.. ఇది కూడా చదవండి..టిపికల్ ఫీవర్స్ అంటే ఏమిటి.. వాటి లక్షణాలు ఎలా ఉంటాయి.. ఇది కూడా చదవండి..మీరు ఆరోగ్యంగా బరువు తగ్గాలంటే.. నిద్రలేమి.. సైలెంట్ ఎపిడెమిక్.. ఇండియన్ జర్నల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ నిర్వహించిన తాజా అధ్యయనం ప్రకారం.. భారతీయుల్లో నిద్ర సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. 25.7 శాతం మంది నిద్రలేమి సమస్యతో సతమతమవు తున్నారు. సుమారు 37.4 శాతం మందిలో ఈ లక్షణాలు కనిపిస్తున్నాయి. 10.6 శాతం మంది ఈ రుగ్మత బారిన పడ్డారు. వైద్య సహాయం పొందడానికి బదులు 62 శాతం మంది ఆన్‌లైన్ చిట్కాలపై ఆధారపడుతుండటం గమనార్హం. హైదరాబాద్ ఐటీ నిపుణుల్లో తీవ్ర ప్రభావం.. హైదరాబాద్ లాంటి నగరాల్లో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఐటీ నిపుణులపై నిర్వహించిన సర్వేలో 97 శాతం మంది పడుకునే ముందు కనీసం గంటపాటు ఎలక్ట్రానిక్ పరికరాలను వాడుతున్నారని తేలింది. దీనివల్ల నిద్ర పట్టకపోవడం లేదా మధ్యలో మెలకువ రావడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. వయస్సు, నిద్ర అవసరమైన సమయం.. నిద్ర అనేది కేవలం విశ్రాంతి మాత్రమే కాదు, మెదడు, శరీర విధులను పునరుద్ధరించే కీలక ప్రక్రియ అని వైద్యనిపుణులు చెబుతున్నారు. 18 నుంచి 45 ఏళ్ల వయస్సు వాళ్లకు 6 నుంచి 8 గంటల నిద్ర తప్పనిసరి. 45 నుంచి 70 ఏళ్ల వయస్సువాళ్లకు 5 నుంచి 7 గంటల నిద్ర అవసరం. 70 ఏళ్లు పైబడిన వారికి కనీసం 5 గంటల నిద్ర అవసరం ఉంటుంది.